ఆంధ్రజ్యోతి
గుంటూరు జిల్లా వార్తలు
5
ఆదివారం 25 మే 2025

ఉష్ణోగ్రత (అంచనా) 25-5-2025

	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	35	27
తెనాలి	34	28
నరసరావుపేట	35	26
బాపట్ల	34	28
రెంటచింతల	35	26
చీరాల	34	28

వేగం.. ప్రమాదం

నిర్లక్ష్య ప్రయాణాలతో ప్రమాదాలు

- ట్రాఫిక్ రూల్స్ పట్టని వాహనదారులు
- రోడ్డు ప్రమాద మృతుల్లో యువతే అధికం
- హెల్మెట్లతో రక్షణ అంటున్నా పట్టించుకోని బైకర్లు
- ప్రమాదాలు తగ్గించాలన్న లక్ష్యాలు ప్రణాళికలకే పరిమితం

(గుంటూరు(తూర్పు) - ఆంధ్రజ్యోతి)

● వేగం.. ఆపై నిద్రమత్తు.. బాపట్ల జిల్లా స్వర్ణపురంలో ఆరుగుర్ని బలితీసుకుంది.

● రైల్లో వస్తున్న స్నేహితుడ్ని తీసుకువచ్చేందుకు అర్ధరాత్రి వెళ్తూ రోడ్డు పక్కన ఆగిన లారీ చీకట్లో కానరాక ఢీకొని తెనాలి సమీపంలోని అంగలకుదురులో ఓ యువకుడు మృతి చెందాడు.

ఇలా.. శుక్రవారం తెల్లవారుజామున గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో పది మంది చనిపోయారు. ఇలా తరచూ జరిగే రోడ్డు ప్రమాదాల్లో ఎందరో మరణిస్తున్నారు. మద్యం మత్తులో, సెల్‌ఫోను మాట్లాడుతూ, రాంగ్‌రూట్ ఇలా అనేక చిన్నపాటి నిర్లక్ష్యాలతో విలువైన ప్రాణాలను పణంగా పెడుతున్నారు. ప్రమాదం అంటే ఒక వ్యక్తి రోడ్డున పడటం కాదు. ఒక కుటుంబం రోడ్డున పడటం... అని ఓ యువ హీరో ఆవేదన వ్యక్తం చేశాడు. అంటే ఇక సామాన్య, మధ్య తరగతి కుటుంబాల్లో పరిస్థితి అర్థం (మిగతా 6వ పేజీలో)

నియంత్రించలేక.. నైపుణ్యం కొరవడి..

అధిక సీసీ సామర్థ్యం కలిగిన బైక్‌లు అందుబాటులోకి వచ్చాయి. ఈ బైక్‌లపై ఊహకందని స్పీడ్‌తో వెళ్తూ వేగాన్ని నియంత్రించలేక ప్రమాదాల భారిన యువకులు, విద్యార్థులు పడుతున్నారు. దీనికి తోడు ఈ మధ్య చాలామంది టీనేజర్స్ కారు డ్రైవింగ్‌పై ఆసక్తి చూపుతున్నారు. గేర్లులేని కార్లు అందుబాటులోకి రావడం వాటిని నడిపే నైపుణ్యం వారిలో లేకపోవడం వంటి కారణాలు కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.





వేగం.. నిర్లక్ష్యం.. రాంగ్‌రూట్.. ఓవర్‌టేక్.. మద్యం మత్తులో.. ప్రయాణాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. ఎందరినో బలి తీసుకుంటున్నాయి. జాతీయ రహదారు లైనా.. రాష్ట్ర రహదారులైనా.. గ్రామీణ రోడ్లు అయినా వాహనదారులు పట్టించుకోకుండా దూసుకెళ్తూ మృత్యు దరికి చేరుతున్నారు. జనసంచారం ఉన్నా.. రద్దీ మార్గా లైనా.. ట్రాఫిక్ రూల్స్‌ను వాహనదారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదు. దీంతో వాహనాలు ఢీకొని ఎందరో మరణిస్తుండగా వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. తీవ్రగాయాలతో జీవచ్ఛవాలుగా మారుతున్న వారు ఎందరో ఉన్నారు. నిత్యం ఎక్కడో ఒక దగ్గర ప్రమాదాలు చోటుచేసుకుంటున్నా.. ఎందరో మరణిస్తున్నా.. వాహనదారుల్లో నిర్లక్ష్యం మాత్రం తగ్గడంలేదు. ర్యాష్ డ్రైవింగ్.. స్నేక్‌డ్రైవింగ్‌లతో యువత తమతో పాటు రోడ్డుపై వెళ్తున్న వారిని బలితీసుకుంటున్నారు. 2025లో గుంటూరు జిల్లాలో జరిగిన ప్రమాదాల్లో 490 మంది ద్విచక్ర వాహన దారులు మృతి చెందగా వారిలో దాదాపు 70 శాతం వరకు యువకులే ఉన్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

సిఫార్సులతోనే లైసెన్సు

అమెరికా వంటి దేశాల్లో డ్రైవింగ్ లైసెన్స్ తీసుకోవడం క్లిష్టమైన ప్రక్రియ. అనేక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలి. అందుకే అక్కడ లైసెన్స్ వచ్చిన వారు పార్టీ కూడా ఇస్తుంటారు. కానీ మనదేశంలో 78 శాతం వరకు లైసెన్స్‌లు సిఫార్సుల మేరకే జారీ అవుతూ ఉంటాయి. అందుకే ఇక్కడ వాహనదారులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన ఉండదు.

స్పీడ్‌గన్‌తో.. నియంత్రణ

వాహనాల అధిక వేగాన్ని అరికట్టేందుకు స్పీడ్‌గన్‌ను గుంటూరు సమీపంలోని మానస సరోవరం వద్ద జాతీయ రహదారిపై ఏర్పాటు చేశారు. దీంతో వాహన దారులు ఈ ప్రాంతంలో నెమ్మదిగా ప్రయాణిస్తుండటంతో ప్రమాదాలు ఇటీవల చాలా వరకు తగ్గాయి. ఇలా స్పీడ్‌గన్‌లతో ప్రమాదాలు నియంత్రించే అవకాశం ఉండటంతో ఇటీవల రెండో స్పీడ్ గన్ ఏర్పాటుకు రవాణాశాఖాధికారులు చర్యలు చేపట్టారు.



ఆధిపత్య పోరులో.. జంట హత్యలు



వెంకటేశ్వర్లు కోటేశ్వరరావు

పల్నాడులో టీడీపీ నేతలు ఇద్దరి హత్య

- బైకుపై వెళ్తుండగా కారుతో ఢీకొట్టి సోదరుల హతం
- వేరే పార్టీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరిన నిందితులు
- జంట హత్యల్లో పిన్నెల్లి సోదరుల హస్తముందన్న ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి
- నాడు వైసీపీ హయాంలో.. నేడు కూటమి ప్రభుత్వంలో టీడీపీ నేతల హతం

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): అసలే పల్నాడు.. ఆపై ఆధిపత్య పోరు. ఎప్పటి నుంచో టీడీపీలో ఉన్న వారు.. ఇటీవల పార్టీ కండువా కప్పుకున్న వారు పెత్తనం కోసం కక్షలు పెంచుకున్నారు. మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం గుండ్లపాడు గ్రామంలో అధికార పార్టీలో ఆధిపత్య పోరు తారాస్థాయికి చేరుకుంది. ఈ క్రమంలో శనివారం గుండ్లపాడు గ్రామానికి చెందిన తొలి నుంచి టీడీపీలో ఉన్న జెవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావులు హత్యకు గురయ్యారు. వీరిని అదే గ్రామానికి చెందిన తోట వెంకట్రామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావులు కారుతో ఢీకొట్టి హత్య చేశారు. గుండ్లపాడులో వైసీపీ ప్రభుత్వ హయాంలో టీడీపీ నేత తోట చంద్రయ్య హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం కలిగించింది. ఇప్పుడు కూటమి అధికారంలోకి వచ్చి సంవత్సరం గడవకముందే టీడీపీ నేతల హత్యతో గుండ్లపాడు ఉలిక్కిపడింది. నాడు వైసీపీ హయాంలోనూ, నేడు టీడీపీ నేతృత్వ కూటమి ప్రభుత్వంలోనూ టీడీపీ నేతల హత్యకు గురికావడంతో ఆ పార్టీ వర్గీయుల్లో ఆందోళన నెలకొంది. గుండ్లపాడు గ్రామ టీడీపీలో చంద్రయ్యతో పాటు ఆది నుంచి జెవిశెట్టి వెంకటేశ్వర్లు, ఆయన సోదరుడు కోటేశ్వరరావు కీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు. చంద్రయ్య హత్యానంతరం వెంకటేశ్వర్లు పార్టీలో ముఖ్యపాత్ర తీసుకున్నారు. అయితే గతంలో వేరే పార్టీలో ఉన్న తోట వెంకట్రామయ్య వర్గం టీడీపీలో చేరింది. గ్రామంలో రాజకీయ ఆధిపత్యం కోసం వెంకట్రామయ్య ఎంతో కాలంగా ప్రయత్నిస్తున్నారు. అయితే జెవిశెట్టి వెంకటేశ్వర్లు అలియాస్ మొద్దయ్యకు గ్రామంలో పట్టు ఉంది. ఈ క్రమంలో జెవిశెట్టి సోదరులు ఉన్నంతవరకు గ్రామంలో తన ఆధిపత్యం నడవదని వెంకట్రామయ్య భావించాడు. ఈ క్రమంలోనే సోదరుల హత్యకు పథకం రూపొందించాడని తెలుస్తోంది. దీనికి తోడు రెండు నెలల క్రితం గ్రామానికి చెందిన వెంకట్రామయ్య వర్గీయుడైన ఉప్పుతోళ్ల శ్రీనివాసరావుపై టీడీపీలోనే ఓవర్గం దాడి చేసి కాళ్లు విరగొట్టింది. ఆ దాడికి పాల్పడిన నిందితులకు జెవిశెట్టి వెంకటేశ్వర్లు వర్గం మద్దతుగా నిలిచింది.

గ్రామ పెద్దగా ప్రకటనతో కంటగింపు

రెండు రోజుల క్రితం ఎస్పీ శ్రీనివాసరావు గ్రామంలో పల్లెనిద్రకు వచ్చారు. గ్రామం లో ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంకటేశ్వర్లును సంప్రదించాలని గ్రామస్థులకు సూచించారు. ఆయా ఇబ్బందులను వెంకటేశ్వర్లు తమ దృష్టికి తీసు కొస్తారని ఆయనను ఎస్పీ గ్రామ పెద్దగా ప్రకటించారు. ఈ క్రమంలో ఎస్పీ ప్రకటన నిందితులకు కంటగింపుగా మారిం ది. శ్రీనివాసరావు కాళ్లు విరగ్గొట్టడం, ఆపై ఎస్పీ కూడా వెంకటేశ్వర్లను గ్రామస్తులు అనుసరించాలని చెప్పడంతో తోట వెంకట్రామయ్యకు రుచించలేదు. ఈ నేపథ్యంలోనే వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావులను అడ్డుతొలగిస్తే గ్రామంలో ఎదురుండదని భావించి వారిని హత్య చేశారని సమాచారం.

గ్రామానికి వస్తుండగా కారుతో ఢీకొట్టి..

జెవిశెట్టి వెంకటేశ్వర్లు, సోదరుడు కోటే శ్వరరావు, అల్లుడు తోట ఆంజనేయులుతో పాటు సుమారు 12 మంది ద్విచక్ర వాహనాలపై తెలంగాణలో ఓ శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో మిగిలిన వారు మాచర్లలో టీ తాగేందుకు ఆగగా వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు ద్విచక్రవాహనం పై గ్రామానికి వస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకున్న వెంక ట్రామయ్య, జెవిశెట్టి శ్రీనివాసరావు, అలియాస్ బొబ్బలితో పాటు మరో ఇద్దరు కారు లో గుండ్లపాడు నుంచి మాచర్లకు వచ్చే మా ర్గంలో ఎదురుగా వెళ్లి భోజనవీడు మండాది గ్రామాల మధ్యలో సోదరులు వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టారు. దీంతో సోదరులు ఎగిరి 100 అడుగుల దూరంలో పడి మృతి చెందారు. ఈ ఘటన జరిగిన పది నిమిషాల తర్వాత వెనుకగా వెంక టేశ్వర్లు అల్లుడు తోట ఆంజనేయులు ద్విచక్ర వాహనంపై రాగా అతడ్ని చూసి నిందితులు కారును అక్కడే వదిలేసి రచ్చమల్లపాడు వెళ్లే డొంక గుండా పారిపోయారు. నిందితుల్లో ఒకడైన జెవిశెట్టి శ్రీనివాసరావు హతులకు పెదనాన్న కొడుకు కావడం గమనార్హం.



ఎమ్మెల్యేకు ఘటన గురించి వివరిస్తూ విలపిస్తున్న కుటుంబ సభ్యులు

పిన్నెల్లి హస్తంపై ఆరోపణలు

వెంకటేశ్వర్లు సోదరుల హత్యలో వైసీపీ వర్గీయులు, ప్రధానంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి హస్తం కూడా ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వెంకటేశ్వర్లు సోదరుల హత్యతో టీడీపీలోని ప్రత్యర్థి గ్రూపుతో పాటు గ్రామంలో వైసీపీ ఆధిపత్యానికి కూడా ఎదురుండదనే కారణంతోనే జంట హత్యలు జరిగినట్లు టీడీపీ శ్రేణులు భావిస్తున్నాయి. సోదరుల హత్యలో పిన్నెల్లి పాత్ర ఉందని హతుల కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమాచారం తెలిసిన వెంటనే సోదరుల కుటుంబంలోని మహిళలు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను చూసి కన్నీటి పర్యంత మయ్యారు. వెంకటేశ్వర్లుకు భార్య అచ్చమ్మ కుమారుడు ఆం జనేయులు, కూతురు అనురాధ ఉన్నారు. కోటేశ్వరరావుకు భార్య గాలమ్మ, కుమారుడు లక్ష్మయ్య ఉన్నారు. సోదరుల హత్య గ్రామంలో విషాదాన్ని మిగిల్చింది. వరుస ఘటనల నేపథ్యంలో గ్రామంలో ఎప్పుడు ఏం జరుగుతుందోనని సర్వత్రా భయాందోళనలు నెలకొన్నాయి.

సంఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్పీ

జంట హత్యలు జరిగిన ప్రాంతాన్ని ఎస్పీ కంచె శ్రీనివాసరావు పరిశీలించారు. హత్య జరిగిన కోణాన్ని, వాహనాన్ని, మృతదేహాలను పరిశీలించారు. మాచర్ల పట్టణ సీఐ పచ్చిపాళ్ల ప్రభాకర రావు, వెల్దుర్తి ఎస్ఐ సమందర్‌వలి, విజయపురిసౌత్ ఎస్ఐ మహ్మద్ షఫి, ఎంపీఐ శేషురెడ్డిల నుంచి సమాచారం సేకరించారు. కేసు నమోదు చేసుకుని దర్యా ప్తు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.

శాంతిభద్రతలకు పిన్నెల్లి సోదరుల విఘాతం : బ్రహ్మారెడ్డి

హైదరాబాదులో ఉన్న ఎమ్మె ల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి జంట హత్యల విషయం తెలుసు కు న్న వెంటనే హుటాహుటిన రాత్రికి గ్రామానికి (మిగతా 6వ పేజీలో)

మాటలు కాదు.. ఫలితాలు కావాలి

- బర్లీ పొగాకు కొనుగోళ్లపై కంపెనీలకు ఆదేశాలు
- మార్టూరులో రైతులతో ముఖాముఖిలో మంత్రి అచ్చెన్నాయుడు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

'మాటలు కాదు.. ఫలితాలు కావాలి. బర్లీ పొగాకు రైతులకు న్యాయం జరగాలి. ఒక్క రైతు మరణం కూడా జరగకూడదు. ధర ఆశచూపి.. కొనుగోళ్లపై హామీ ఇచ్చి ఇప్పుడు ఎందుకు తప్పుకు తిరుగుతున్నారు. ప్రభుత్వం పదేపదే ఆదేశిస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదు. కంపెనీలు పూర్తి స్థాయిలో బర్లీ పొగాకును కొనాలి. అప్పటికి ఇంకా మిగిలితే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దింపి చివరి ఆకు వరకు కొనుగోలు చేస్తాం..' అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు పొగాకు కంపెనీలను ఆదేశించారు. బర్లీ పొగాకు రైతుల కష్టనష్టాలపై మంత్రి అచ్చెన్నాయుడి సారథ్యంలో మార్టూరులో శనివారం ముఖాముఖి సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తొలుత రైతులు తమ గోడును సబ్‌కమిటీ ఎదుట వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్య తప్ప వేరే మార్గమే లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది కంపెనీల ప్రతినిధులు ఇంటింటికి తిరిగి బర్లీ పొగాకు సాగు చేయాలని కోరాయని, ప్రస్తుత సంక్షోభానికి కారణం వారేనని రైతులు వాపోయారు. ధర ఆశచూపి నిలువునా వంచించాయంటూ జీపీఐ కంపెనీ వ్యవహారశైలిపై మండిపడ్డారు. రైతుల్లో భరోసా నింపాల్సిందేనని దానికి ఏంచేయగలరో చెప్పండని మంత్రి కంపెనీ ప్రతినిధులను నిలదీశారు. చివరి ఆకు వరకు కొనాల్సిందేని, అందుకు ప్రభుత్వం నుంచి కావాల్సిన సహాయం ఏమిటో కూడా చెప్పాలన్నారు. రైతులు గ్రేడ్లు చేసే పరిస్థితిలో లేరని కొనుగోలులో రెండే ప్రామాణికాలు ఉండేలా చూడాలని సమావేశానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు ప్రతిపాదించారు. సమావేశంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, వ్యవసాయశాఖ కమిషనర్ డిల్లీరావు, ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, టుబాకో బోర్డు ఛైర్మన్ యశ్వంత్, ఏడీ విశ్వసే, వేర్ హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ సురేష్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, కలెక్టర్ వెంకటమురళి, తదితరులు పాల్గొన్నారు.



ధర దక్కడం లేదని మంత్రులకు గోడు వెళ్లబోసుకుంటున్న మహిళా రైతు

31న జడ్పీస్థాయి సంఘం సమావేశాలు

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాపరిషత్తు స్థాయి సంఘం సమా వేశాలు ఈ నెల 31వ తేదీన ఛైర్‌పర్సన్ కత్తెర హెని క్రిష్టిన అధ్యక్షతన జరుగుతాయని సీఈవో జ్యోతిబసు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే శనివారం ఉదయం 10.30 గంటల నుంచి 1, 2, 4, 7 స్థాయి సంఘాల సమావేశాలు ఛైర్‌పర్సన్ అధ్యక్షతన, 3వ స్థాయి సంఘం సమావేశం శొంఠిరెడ్డి నర్సిరెడ్డి, 5వ స్థాయి సంఘం సమావేశం పిల్లి ఉమా ప్రణతి, 6వ సమావేశం బత్తుల అనురాధ అధ్యక్షతన జరుగుతాయని పేర్కొన్నారు. సభ్యులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

ముఖేష్.. షూటింగ్‌లో భేష్..!

● గుంటూరు వాసి మరో రికార్డు ● జర్మనీలో జూనియర్ వరల్డ్ కప్ పోటీల్లో కాంస్యం ● గతేడాది కూడా ఐదు పతకాలతో సత్తా..



కాంస్య పతకం పొందిన ముఖేష్

గుంటూరు, మే 24(ఆంధ్రజ్యోతి): ప్రముఖ షూటింగ్ క్రీడాకారుడు.. గుంటూరు నగరానికి చెందిన నేలవల్లి ముఖేష్ మరో ప్రపంచ రికార్డు సాధించాడు. జర్మనీలో శనివారం జరిగిన వరల్డ్ కప్ పోటీల్లో కాంస్య పతకాన్ని సాధించి.. జిల్లా ప్రతిష్ఠను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లారు. జర్మనీలోని శూల్‌లో జరుగుతున్న ఈ ప్రపంచకప్ పోటీల్లో ముఖేష్ 25 మీటర్ల రాపిడ్ ఫెయిర్ పిస్టల్ విభాగంలో భారత దేశానికి ప్రాతినిధ్యం వహించాడు. రిలేలో 600 కు 573 పాయింట్లతో 6వ స్థానంలో నిలిచాడు. ఫైనల్ పోరులో ఫ్రాన్స్‌కు చెందిన చినోర్స్ థామస్ క్లిమెంట్ బంగారు పతకం గెలవగా, పోలాండ్‌కు చెందిన కోపీవోద విక్టర్ లోకస్జ్ రజతం గెలిచాడు. మూడో స్థానంలో నిలిచిన ముఖేష్ కు కాంస్య పతకం లభించింది.

గతేడాది పెరూలో..

గతేడాది నవంబరులో పెరు దేశంలోని లిమా లో జరిగిన ప్రపంచ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో భారతదేశానికి ప్రాతినిధ్యం వహించిన ముఖేష్ రికార్డు స్థాయిలో 5 స్వర్ణాలు, రెండు కాంస్య పతకాలు గెలిచాడు. నాలుగేళ్లుగా జాతీయ స్థాయిలో ముఖేష్ 50కి పైగా పతకాలు సాధించాడు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్ లో 2019 నుంచి గతేడాది వరకు వరుసగా ఆంధ్ర రాష్ట్రానికి బంగారు, వెండి, కాంస్య పతకాలను అందించాడు. ఈ ఏడాది యూనివర్సిటీ గేమ్స్‌లో కేఎల్ యూనివర్సిటీ నుంచి ప్రాతినిధ్యం వహించిన ముఖేష్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ విభాగంలో రజతం, 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్ విభాగంలో కాంస్య పతకం గెలిచాడు. ఆగస్టులో కజకిస్తాన్‌లో జరగనున్న ఏషియన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో కూడా ముఖేష్ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించనున్నాడు. అలాగే జాతీయ స్థాయిలో 2022లో భోపాల్‌లో జరిగిన నేషనల్ రైఫిల్ షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో 25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్ విభాగంలో స్వర్ణ పతకం సాధించి, కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు.

గురువు శిక్షణ.. తల్లిదండ్రుల ప్రోత్సాహం

గుంటూరులోని ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్‌లో ముఖేష్ శిక్షణ పొంది.. అక్కడ చీఫ్ కోచ్ ఎన్ సుబ్రమణ్యేశ్వరరావు మార్గదర్శకత్వంలో తన ప్రతిభకు మరింత పదును పెట్టాడు. ముఖేష్ తండ్రి శ్రీనివాస్ గుంటూరులో న్యాయవాదిగా పేరొందారు. తల్లి మాధవి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయరాలుగా పనిచేస్తున్నారు. ముఖేష్ ప్రస్తుతం కేఎల్ యూనివర్సిటీలో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు.

స్వగ్రామానికి రోడ్డు ప్రమాద మృతదేహాలు

బాపట్ల, గిద్దలూరు, మే24 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కొమరవోలు గ్రామంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బాపట్ల మండలం స్టూవర్టుపురం గ్రామానికి చెందిన ఆరుగురు దుర్మరణం చెందారు. గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలలో వైద్యాధికారులు పోస్టుమార్టం పూర్తి చేసి, మృతదేహాలను పోలీసులు బంధువులకు అప్పజెప్పారు. 3 అంబులెన్స్‌లలో మృతదేహాలను స్వగ్రామం తీసుకుని వచ్చారు. మార్కాపురం డీఎస్పీ యూ.నాగరాజు, రూరల్ సీఐ రామకోటయ్య, కొమరోలు ఎస్సై నాగరాజు పర్యవేక్షించారు. స్టూవర్టుపురం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. నాలుగు కుటుంబాలకు చెందిన ఆరుగురు మృతి చెందడంతో గ్రామమంతా శోక సంద్రమైంది. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మృతదేహాలను సందర్శించి, నివాళులర్పించారు.

కారు ఢీకొని ఒకరు మృతి

నరసరావుపేట రూరల్, మే 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు - గుంటూరు ప్రధాన రహదారి పై నరసరావుపేట - జొన్నలగడ్డ గ్రామాల మధ్యలో శుక్రవారం రాత్రి ఆటోను కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో నరసరావుపేట పట్టణంలోని క్రిస్టియన్‌పాలేనికి చెందిన గోళ్లమూడి దయాకర్ (52) తీవ్రంగా గాయపడి అక్కడి కక్కడే మృతి చెందాడు. రూరల్ పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు. మృతిడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

వేగం.. ప్రమాదం

(5వ పేజీ తరువాయి)

చేసుకోవచ్చు. అత్యంత అప్రమత్తంగా నియమాలకు అనుగుణంగా ఉండాల్సిన ప్రయాణం కొద్దిపాటి నిర్లక్ష్యంతో విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఒకరి నిర్లక్ష్యం అన్నెం, పున్నెం ఎరుగని ఇతరుల ప్రాణాలు పోవడానికి కారణమవుతుంది. ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయేవారు కొందరైతే అవయువాలు కోల్పోయి విగత జీవులుగా మారుతున్న వారు ఎందరో ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలపై ఎన్ని అవగాహన కార్యక్రమాలు నిర్వహించిన వాహనదారుల తీరులో మార్పు కనబడటం లేదు. గత కొంత కాలంగా రోడ్డు ప్రమాదాలు గణనీయంగా పెరిగాయి. మృతుల్లో ఎక్కువ మంది యువకులే ఉండటం మరింత ఆందోళన కల్గించే విషయం. ఏటా రోడ్డు ప్రమాదాల బారిన పడి మృతుల సంఖ్య పెరుగుతుందే తప్ప తగ్గడం లేదు. దీనికి తోడు ఏడాదిలో 3 శాతం ప్రమాదాలు తగ్గించాలని పెట్టుకున్న లక్ష్యాలు ప్రణాళికలకు మాత్రమే పరిమితమయ్యాయి.

అర్బన్‌లోనే అత్యధికం

రోడ్డు ప్రమాదాల, మృతుల విషయంలో ఉమ్మడి గుంటూరు జిల్లాలో నమోదైన గణాంకాలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. మృతుల్లో మూడో వంతు అర్బన్ పరిధిలో ఉంటున్నాయి. సిబ్బంది పరంగా కొరత లేనప్పటికి ఈ స్థాయిలో ప్రమాదాలు జరగడం అంతు చిక్కని ప్రశ్నగా మారింది. ప్రధానంగా గుంటూరు నగరం, ఇతర ప్రధాన పట్టణాల్లో యువత బైక్ రేసింగ్‌లు ఎక్కువ అవుతున్నా వాటిపై నిఘా కొరవడిందని.. అందువల్లే ప్రమాదాలు, మరణాలు ఎక్కువ జరుగుతున్నాయని తెలుస్తోంది. కళాశాలలు అధికంగా ఉండటం వల్లే యువత బైక్ ప్రమాదాల బారిన పడుతున్నారని అధికారులు చెబుతున్నా నివారణ చర్యలు చేపట్టడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. నామమాత్రపు తనిఖీలు, కొద్దిపాటి జరిమానాలు, తూతుమంత్రపు కౌన్సిలింగ్ వంటి చర్యలతో ఫలితాలు లేవని రుజువు అవుతున్నా అధికారుల్లో చలనం ఉండటంలేదు.

మనకేందుకులే అనే ధోరణి

ప్రమాదం జరిగినప్పుడు చూసిన వ్యక్తులు సమాచారం ఇవ్వడానికి ముందుకు రాకపోవడం కూడా మృతుల సంఖ్య పెరగడానికి మరో కారణం. ప్రమాదం జరిగిన తొలిగంటలో సమాచారం ఇస్తే 70 శాతం వరకు ప్రాణాలను కాపాడవచ్చు. దీనిని గోల్డెన్ అవర్ అని అంటారు. అయితే ప్రమాద సమాచారం ఇస్తే చట్టపరంగా ఏమైనా ఇబ్బందులు వస్తాయనే భయం, మనకేందుకులే అనే ధోరణి పలువురిలో ఇప్పటికీ ఉంది. ప్రమాద సమాచారం ఇచ్చిన వారికి రూ.5 వేలు నజరానా, ప్రశంసాపత్రం, చట్టప్రకారం ఇబ్బందులు లేకుండా చూడటం వంటి నియమాలు అందుబాటులోకి వచ్చినా ఎవరూ ముందుకు రావడం లేదు.

క్షతగాత్రుల వేదన చూసి మార్పు

రోడ్డు ప్రమాదంలో సభ్యుడిని కోల్పోయి ఆ కుటుంబం ఎంత మానసిక వేదనకు గురవుతుందనే విషయంపై జర్మనీలో విద్యార్థులను ఆయా కుటుంబాల వద్దకు తీసుకెళ్లి ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. విద్యార్థులు, యువతకు ట్రాఫిక్ రూల్స్ నేర్పడంతో పాటు ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చనేది వారి నమ్మకం. ఈ విధానం ద్వారా జర్మనీలో కొంత మేరకు ఫలితాలు సాధించారు.

తనిఖీలు ముమ్మరం చేస్తాం



ప్రమాదాలు, మృతులు పెరగడం ఆందోళన కలిగించే విషయం. ఇకపై తనిఖీలు ముమ్మరం చేస్తాం. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుంటూ తనిఖీలు చేపడతాం. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై చర్యలు తప్పవు. ఈ ఏడాదిలో ప్రమాదాల గణంకాలు తక్కువ నమోదుకు కృషి చేస్తాం.

- కే సీతారామిరెడ్డి, గుంటూరు జిల్లా ఉప రవాణ కమిషనర్

తల్లిదండ్రుల భాగస్వామ్యం ముఖ్యం



మైనర్లకు వాహనాలు ఇచ్చే విషయంలో తల్లిదండ్రులు కఠినంగా వ్యవహరించాలి. ముఖ్యంగా ఎక్కువ సీసీ సామర్థ్యం ఉన్న బైక్‌లు, కార్లు వారికి అందుబాటులో ఉంచకూడదు. తల్లిదండ్రుల భాగస్వామ్యం లేనిదే వీటి నివారణ పూర్తి స్థాయిలో సాధ్యం కాదు. ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయాలి.

- కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ

కిమ్స్‌లో మెకానిల్ థ్రాంబెక్టమీ సర్జరీలు

● పక్షవాత రోగులకు మెరుగైన వైద్యచికిత్సలు



మాట్లాడుతున్న వైద్యులు ప్రదీప్‌రెడ్డి, వివేక్, లక్ష్మణ్

గుంటూరు మెడికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): తీవ్రమైన పక్షవాత రోగులకు కిమ్స్ హాస్పిటల్స్‌లో అత్యాధునిక వైద్యచికిత్సలైన మెకానికల్ థ్రాంబెక్టమీ ప్రొసీజర్‌ను అందుబాట్లోకి తెచ్చినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ చిట్టెం లక్ష్మణ్‌రావు తెలిపారు. శనివారం మంగళదాస్ నగర్‌లోని కిమ్స్ హాస్పిటల్స్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్‌రెడ్డి, న్యూరో ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ వివేక్ లంకాతో కలసి ఆయన మాటాడారు. పక్షవాతానికి గురైన మొదటి నాలుగు గంటల్లో రోగులకు ఈ చికిత్స అందించడం ద్వారా ప్రాణహాని నుంచి కాపాడటంతో పాటు సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయవచ్చని డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. రోగి మెదడులో రక్తం గడ్డ కట్టడం వల్ల ఇస్కీమిక్ స్ట్రోక్ సంభవిస్తుందని, యాంజియోగ్రామ్ ద్వారా సూక్ష్మమైన కెథెడర్ అనే పరికరం పంపి మెదడు రక్తనాళాలల్లో పూడికలను తొలగించడమే మెకానికల్ థ్రాంబెక్టమీ అని ఆయన తెలిపారు. గతంలో మందుల ద్వారా రక్తనాళాల్లో పూడికలను కరిగించే వారని, ఇందుకు కొంత సమయం పట్టేదని ఆయన వివరించారు. , దీని వల్ల రోగులు కోలుకునేందుకు కొంత సమయం పట్టడంతో పాటు శారీరక వైకల్యం ఏర్పడే ప్రమాదం ఉండేదన్నారు. అత్యాధునిక మెకానికల్ థ్రాంబెక్టమీతో మెదడు రక్తనాళాల్లో పూడికలు వెంటనే తొలగించడం వల్ల రక్తసరఫరా పునరుద్ధరిస్తామని, ఫలితంగా రోగులు వేగంగా కోలుకుంటారని ఆయన వెల్లడించారు. ఈ నెల 19వ తేదీన నర్సరావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ (45) ఇస్కీమిక్ పక్షవాతం బారిన పడగా, కిమ్స్ హాస్పిటల్స్‌లో ఎక్యూట్ న్యూరలాజికల్ ఎమర్జెన్సీ వైద్య బృందం అతడికి థ్రాంబెక్టమీ చికిత్సలు అందించినట్లు న్యూరో సర్జన్ డాక్టర్ లక్ష్మణరావు తెలిపారు. వారం రోజుల్లోనే బాధితుడు పూర్తిగా కోలుకున్నట్లు చెప్పారు.

ఆధిపత్య పోరులో.. జంట హత్యలు

(5వ పేజీ తరువాయి)



హత్యకు ఉపయోగించిన స్కార్పియో

వచ్చారు. హతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో స్వల్ప వివాదాలను ఆసరాగా తీసుకుని పిన్నెల్లి సోదరులు రెచ్చగొట్టి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని ఆరోపించారు. వివిధ మండలాల్లో వైసీపీ శ్రేణులను రెచ్చగొట్టి కవ్వింపు చర్యలకు పాల్పడేటట్లు చేస్తున్నారన్నారు. గ్రామాలు అభివృద్ధి పరచాలని నేను ప్రయత్నిస్తుంటే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, వెంకట్రామిరెడ్డిలు హత్యా రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. జంట హత్యల్లో కూడా వారి హస్తం ఉందని, దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. పోలింగ్ ముందు, పోలింగ్ తర్వాత అల్లర్లకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడంలో పోలీసు వ్యవస్థ విఫలమైందని, అందువల్లే సంఘటనలు పునరావృతం అవుతున్నాయని ఆరోపించారు. మా పార్టీ కార్యకర్తలను మందలిస్తున్నానని, ప్రతిపక్షం వారు రెచ్చగొడుతున్నారన్నారు. మాచర్ల నియోజకవర్గంలో పోలీసు వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలన్నారు.



ప్రత్యక్ష సాక్షి ఆంజనేయులును విచారిస్తున్న ఎస్ఐ మహ్మద్‌షఫి

రూ. 1.97 కోట్ల సిగరెట్లు సీజ్

● ఏపీ జీఎస్టీ, విజిలెన్స్ మూకుమ్మడి దాడులు
● అనుమతి లేని సిగరెట్లు, డిష్‌వాష్ సబ్బులు స్వాధీనం

గుంటూరు సిటీ, మే 24(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలో భారీ మోతాదులో అనుమతి లేని సిగరెట్‌లు, డిష్‌వాష్ సబ్బులను ఏపీ జీఎస్‌టీ అధికారులు విజిలెన్స్‌తో సమన్వయంతో సీజ్ చేశారు. బుడంపాడు సమీపంలోని అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్‌లో షాప్ నంబర్ 33 లో బిహార్‌లోని పాట్నా నుంచి అక్రమంగా లారీలో తీసుకువచ్చి దిగుమతి చేసుకుంటున్న సిగరెట్‌లను రెండు శాఖల అధికారులు పట్టుకొన్నారు. వాటిని పరిశీలించగా ఏ విధమైన అనుమతి లేకుండానే రవాణ చేసి తీసుకొచ్చినట్లు గుర్తించారు. జీటీపీఎల్ స్టెప్, విమల్ బ్రాండ్ పేరుతో ఈ సిగరెట్లు ఉన్నాయి. మొత్తం 206 బేల్స్‌లో ప్యాకింగ్ చేసి తీసుకొచ్చారు. ఒక్కో బేల్‌లో రెండు కార్టన్స్ ఉండగా.. ఒక్కో కార్టన్‌లో 60 బాక్సులున్నాయి. అనుమతి లేకుండా రవాణ కాబడిన వాటి విలువ రూ. 1,97,76,000 గా లెక్కించారు. అలానే జంక్ బ్రాండ్ పేరుతో డిష్‌వాష్ సబ్బులు 265 కార్టన్లను దిగుమతి చేశారు. ఒక్కో కార్టన్‌లో 12 సబ్బులుండగా వాటిపై ఎంఆర్‌పీ రూ.55గా ఉంది. వీటి విలువ రూ. 1,74, 900గా లెక్కించారు. వీటి ఇన్‌వాయిస్, ఈవే బిల్లు ఈ నెల 17న జనరేట్ చేశారు. గౌడీయమటం రోడ్డులో చిరునామాతో ఇన్‌వాయిస్ జనరేట్ చేసి బుడంపాడు బైపాసు రోడ్డులోని అన్నపూర్ణ కమర్షియల్ కాంప్లెక్స్‌లో దిగుమతి చేశారు. ఈ మొత్తం స్టాక్ బిహార్ నుంచి సుభాష్ అనే వ్యక్తి గుంటూరు నగరానికి చెందిన సూర వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట్ అనే వ్యక్తికి సరఫరా చేస్తున్నట్లుగా నిర్ధారణ అయ్యిందని విజిలెన్స్ సీఐ కొమ్మాలపాటి చంద్రశేఖర్ పేర్కొన్నారు. సీజ్ చేసిన సిగరెట్లు, సబ్బులను పౌరసరఫరాల శాఖ గుంటూరు తూర్పు డిప్యూటీ తహసీల్దార్ బి.భాస్కర్‌కు అందజేశారు. ఏపీ జీఎస్‌టీ, సీవోటీపీఏ 2003 చట్టాల ప్రకారం కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ కేసు వివరాలను రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ అహ్మద్‌బాబుకు ఇక్కడి ఏపీజీఎస్‌టీ అధికారులు నివేదించారు.

సాగర్ సమాచారం

విజయపురిసౌత్, మే 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 512.50 అడుగులు ఉంది. ఇది 135.95 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 5598 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 900 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 6498 క్యూసెక్కుల నీరు దిగువకు చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.10 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	125, 134, 145
చికెన్ విత్ స్కిన్(కిలో)	236.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	246.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ



మార్కెట్ ప్రాంతంలో పర్యటిస్తున్న నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర, కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు

టెండరుదారులే చెత్త తొలగించాలి

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు కార్పొరేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగర పాలక సంస్థ పరిధిలో హోల్‌సేల్ మార్కెట్లలో ఆశీలు వసూళ్ళకు టెండర్ పొందిన వాళ్ళు నిర్దేశిత ప్రాంతంలోనే ఆశీల్లు వసూళ్ల చేయడంతో పాటు ఆయా ప్రాంతాలలో వ్యర్థాలను కూడా వారే తొలగించాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి శనివారం ఆయన బండ్ల బజార్ (హోల్ సేల్ ఫ్రూట్ మార్కెట్), లాలాపేట, పట్నంబజార్, ఆదర్శ్ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరాపై అందిన ఫిర్యాదులను నేరుగా పరిశీలించి సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు.

మేయర్ మాట్లాడుతూ పట్నంబజారులో ప్రతి రోజు క్వింటాళ్ల కొద్దీ వ్యర్థాలు వస్తున్నాయని, వాటిని సరైన పద్ధతిలో తొలగించకపోవడం వలన స్థానికంగా తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. హోల్‌సేల్ మార్కెట్‌లో అశీలు వసూళ్ళకు టెండర్ పొందిన వారు నిర్దేశిత ప్రాంతంలో నూరు శాతం వ్యర్థాలను తొలగించాల్సిందేనన్నారు. కమిషనర్ మాట్లాడుతూ లాలాపేట, పట్నం బజారు, బండ్ల బజారు ప్రాంతాలలో హోల్ సేల్ వ్యాపారస్తుల నుంచి అసీలు వసూలు చేసే టెండర్ దారు ఆయా ప్రాంతాల పరిశుభ్రత బాధ్యత తీసుకోవాలన్నారు. ఆదర్శనగర్‌లో తాగునీటి సరఫరాపై అందిన ఫిర్యాదు ప్రాంతాన్ని పరిశీలించి, సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో మహమ్మద్ చిష్టి, ఈరంటి వరప్రసాద్, సీఎంఓహెచ్ డాక్టర్ అమృతం, సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ నాగమల్లేశ్వర రావు, రెవెన్యూ, ఇంజనీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటూరు నగర అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : మేయర్

గుంటూరు కార్పొరేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు నగరాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. ఆయన శనివారం సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యే గళ్ళా మాధవి ఆధ్వర్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. గత వైసీపీ హయాంలో సీసీ డ్రెయిన్లు కూడా నిర్మించకపోవటం వలన వర్షాకాలంలో వరదలు వచ్చాయన్నారు. ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 45వ డివిజన్ చైతన్యపూరి, గౌతమి నగర్ లో రూ.72.20 లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఆర్‌సీసీ కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వడ్లమూడి వెంకటేశ్వరరావు, కొమ్మినేని కోటేశ్వరరావు, బెజవాడ కృష్ణారెడ్డి, కూరుకుల శోభారాణి, రఫీ, బాజీ, దుడికి సాంబయ్య, నాగుల్ మీరా, రామారావు తదితరులు పాల్గొన్నారు.

డంపర్ బాక్సులు ఉపయోగించండి : సీపీఐ

గుంటూరు కార్పొరేషన్, మే 24(ఆంధ్రజ్యోతి): నగరంలో డంపర్ బాక్సులు ఉపయోగించాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి కోరారు. నగరపాలక సంస్థలో మేయర్ కోవెలమూడి రవీంద్రని శనివారం కార్యాల యంలో కలసి వినతి పత్రం అందజేశారు. మల్యాద్రి మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోమని కోరారు. దీంతో స్పందించిన మేయర్ తగు చర్యలు తెలుసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు చినబోతుల వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి కోట మాల్యాద్రి, కోశాధికారి కోటి వీరాంజనేయులు, సహాయ కార్యదర్శి బొట్టు సద్గుణరావు, ఉపాధ్యక్షుడు మిరియాల కోటేశ్వరరావు, శ్యాంసన్, మహేశ్వరరావు, అంతరాజు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా శాస్త్రవేత్త జయంత్ నర్లీకర్

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

గుంటూరు (విద్య), మే 24 (ఆంధ్రజ్యోతి) : సామాన్య ప్రజలకు శాస్త్రీయ దృక్పథాన్ని వైజ్ఞానిక విజ్ఞానాన్ని పెంచిన ఘనత జయంత్ నర్లీకర్‌కు దక్కుతుందని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. యూటీఎఫ్ హాలులో శనివారం నిర్వహించిన జయంత్ నర్లీకర్ సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని సామాన్య ప్రజలకు అందించారని వెల్లడించారు. ఖగోళ శాస్త్ర విజ్ఞానాన్ని ఆయన విశ్వవ్యాప్తం చేశారని చెప్పారు. సమావేశంలో జన విజ్ఞాన వేదిక నాయకులు టీఆర్ రమేష్, బీ.ప్రసాద్, ఎం.ఉదయభాస్కర్, పి.జానుబాబు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

రేషన్‌షాపుల చిరునామాలపై విస్తృత ప్రచారం కల్పించాలి

● గుంటూరు పశ్చిమ తహసీల్దార్ వెంకటేశ్వర్లు

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల చిరునామాలపై డీలర్లు విస్తృత ప్రచారం కల్పించాలని గుంటూరు పశ్చిమ మండలం తహసీల్దార్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. ఆయన శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నందున చాలామంది కార్డుదారులకు వారు ఏ రేషన్ దుకాణంలో మ్యాపింగ్ అయ్యారో తెలియదన్నారు. ఈ నేపథ్యంలో డీలర్లు వారికి అవగాహన కల్పించాలన్నారు. జూన్ 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దుకాణాల వద్దనే సరుకులు పంపిణీ చేయాలన్నారు. నిత్యం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకు షాపులు తెరిచి ఉంచాలన్నారు. 65 ఏళ్ల వయస్సు పైబడిన, అంగ వైకల్యం కలిగిన వారికి డీలర్లే ఇంటివద్దకు వెళ్లి సరుకులు పంపణీ చేయాలన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ ఖాదర్‌బేగ్, రేషన్ డీలర్ల సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సహజ వనరులను దోచుకునేందుకే ఆపరేషన్ కగార్

● సీ పీ ఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలోని సహజ వనరులను దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై యుద్ధం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ ఆరోపించారు. గుంటూరు, సీపీఐ కార్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కళారూపాల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. అయన మాట్లాడుతూ చర్చలకు మావోయిస్టులు అంగీకారం తెలిపినా... ఈ యుద్ధం ఎందుకని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న అంతర్యుద్ధం ప్రజలకు ముప్పన్నారు. శవాల కోసం కుటుంబసభ్యులు కోర్టును ఆశ్రయించే పరిస్థితి వచ్చిందని, ఇటువంటి అమానుషం ఎన్నడూ చూడలేదని అన్నారు. పహల్గాం ఘటనలో 26 మంది టూరిస్టులను చంపిన టెర్రరిస్టులను పట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిగిన ప్రచారంతో ఒరిగిందేమి లేదన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల మహాసభలు పూర్తి అయిన తరువాత ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుపుకోబోతున్నామని చెప్పారు. ఆపరేషన్ కగార్, ఇతర సమస్యలపై ఆదివారం విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జంగాల అజయ్‌మార్, గని, పులి సాంబశివరావు, రామకృష్ణ, చంద్రనాయక్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌విలాస్ ఆర్‌వోబీ పిల్లర్ల పనులు రెండు వారాల్లో మొదలుకావాలి

● ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ ఆదేశాలు



సమీక్షలో పాల్గొన్న ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ, కమిషనర్ శ్రీనివాసులు

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు వేగవంతం చేసేలా సంబంధిత శాఖలు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ ఏ.భార్గవ్ తేజ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని తన కార్యాలయంలో ఆయన నగర పాలక సంస్థ కమిషనర్ పులి శ్రీనివాస్‌తో కలిసి శంకర్ విలాస్ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులపై ఆర్ అండ్ బీ, మున్సిపల్, పోలీస్, రైల్వే, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, నిర్మాణ ఏజెన్సీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఇన్‌ఛార్జ్ కలెక్టర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ శంకర్ విలాస్ ఆర్ఓబీ పనులకు సంబంధించి పిల్లర్ల నిర్మాణ పనులు రెండు వారాల్లో ప్రారంభించేలా నిర్మాణ ఏజెన్సీని సమన్వయం చేసుకుంటూ మున్సిపల్ ఆర్ అండ్ బి, విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్మాణ ఏజెన్సీకి హిందూ కళాశాల, లాడ్జీ సెంటర్ వైపు ప్రీకాస్ట్ మెటీరియల్ సిద్ధం చేసుకోవడానికి గుర్తించిన స్థలాలను మరోసారి పరిశీలించి మంగళవారం నాటికి వివరాలు తెలియచేయాలన్నారు. ఆర్ఓబీ నిర్మాణ ప్రాంతంలోని విద్యుత్ స్తంభాలను పక్కకు తరలింపునకు మరోసారి విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించి అంచనాలను మున్సిపల్ శాఖకు అందించాలన్నారు. ఆర్ఓబీ పనులు సజావుగా కొనసాగేలా సంబంధిత శాఖలు నిర్మాణ ఏజెన్సీతో నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్‌వో ఎస్ఎస్ కె ఖాజావలి, కేంద్ర గ్రామీణ అభివృది, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి ఓఎస్‌డి అరూప్ కుమార్, ట్రాఫిక్ డీఎస్పీ రమేష్ బాబు, నగరపాలక సంస్థ ఎస్ఈ నాగమల్లేశ్వరరావు, ఆర్ అండ్ బీ ఈఈ సమర్పణ రావు, విద్యుత్ శాఖ ఈఈ నాగేశ్వరరావు, రైల్వే డీఈ భరత్, బీఎస్ఎన్ఎల్ డీఈలు రఘురాం, నాగరాజు, ట్రాఫిక్ సీఐలు అశోక్ కుమార్, సింగయ్య, నిర్మాణ ఏజెన్సీ లక్ష్మణ్ ఇన్‌ఫ్రా వైస్ ప్రెసిడెంట్ సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం నుంచి ప్రారంభమైన రథయాత్ర

కన్నుల పండుగగా వీరాంజనేయస్వామి రథోత్సవం

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): హనుమజ్జయంతి ఉత్సవాల సందర్భంగా శ్రీనివాసరావుతోట శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో ఉత్సవ మూర్తులను శనివారం ప్రత్యేక ఒంటె వాహనంపై మంగళ వాయిద్యాల మధ్య నగర వీధుల్లో ఊరేగించారు. శ్రీనివాసరావుతోట, వడ్డెర గూడెం మీదుగా రామనామ క్షేత్రం వరకు అత్యంత వైభోపేతంగా ఊరేగింపు సాగింది. మహిళలు నిర్వహించిన కోలాటం ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారి కోగంటి పవన్ కుమార్, ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు సుబ్రహ్మణ్యం, తోట వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడు పుప్పాల నాగయ్య, నారదాసు కోటేశ్వరరావు, తోట శంకరరావు, నరసింహారావు, రాయల్, కోటేశ్వరరావు, రాసంశెట్టి శ్రీను, అంజనేయులు, కేశవదాసు, ఆళ్ళ హరి, మోహన్‌రావు, కనకమాలక్ష్మి, రాజేశ్వరి, కోటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమత్ జయంతి మహోత్సవాలు

గుంటూరు (తూర్పు), మే 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మారుతినగర్, శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో హనుమత్ జయంతి మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం, స్వామి వారికి ప్రదోషకాల నందీశ్వర అభిషేకం, స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. తొలుత శ్రీ సురస్రా సమేత ప్రసన్నాంజనేయ స్వామి వారి ఊరేగింపు కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం, పూర్ణాహుతి, స్వాముల ఇరుమడి ప్రదక్షిణాలు జరుగుతాయని దీంతో ఉత్సవాలు ముగుస్తాయని పాలకమండలి సభ్యుడు కొర్రపాటి రామారావు తెలిపారు. కార్యక్రమాలను కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

అలరించిన ప్రహ్లాద భక్తి విజయం యక్షగాన ప్రదర్శన

గుంటూరు(తూర్పు), మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావన్ గార్డెన్స్, శ్రీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానం, అన్నమయ్య కళావేదికపై ఈశ్వర వరప్రసాద పరిషత్తు ఆధ్వర్యంలో సద్గురు త్యాగరాజ విరచిత ప్రహ్లాద భక్తి విజయం యక్షగాన ప్రదర్శన ఆహుతులను విశేషంగా అలరించింది. కార్యక్రమాల్ని దేవస్థానం పాలకమండలి అధ్యక్షుడు చిటిపోతు మస్తానయ్య ప్రారంభించగా, కార్యక్రమంలో కాజా నాగలక్ష్మి, సెట్లం చంద్రమోహన్, పి.సత్యనారాయణ రాజు, రవికృష్ణ పాల్గొన్నారు.

దహన సంస్కారాలకు ఆర్థిక సాయం అందజేత

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏటుకూరు రోడ్డు, శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయం సమీపంలో శనివారం బత్తుల పుల్లమ్మ అనే పేద వృద్ధ మహిళ అనారోగ్యంతో మృతి చెందారు. డబ్బులు లేకపోవడంతో ఆమె దహన సంస్కారాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న వాసవీ క్లబ్ సభ్యులు ఆ కుటుంబానికి అండగా నిలబడ్డారు. దహన సంస్కారాలకు, ఇతర ఖర్చుల కోసం రూ27 వేలను అందించారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు రాయవరపు ఆశోక్‌కుమార్, సభ్యులు జుజ్జూరి శ్రీనివాసరావు, హరి, సతీష్, కిషోర్, కోటేశ్వరరావు, మణిశేఖర్, బాబ్జీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

దంపతులపై దాడి

గుంటూరు మే 24 (ఆంధ్రజ్యోతి) : లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని చౌత్రా సెంటర్‌కు చెందిన వలివేలు వెంకటేశ్వర్లు, అతని భార్య ప్రియాంక పుల్కా పాయింట్‌లో పని చేస్తుంటారు. వాళ్ల పని చేసే పుల్కా పాయింట్ వద్ద గతంలో ఆయిల్ ప్యాకెట్లు దొంగతనం చేశారని గల్లా శివకుమారి, ఆమె కుటుంబ సభ్యులు నిందలు వేస్తున్నారు. దీంతో బాధితులు తమపై ఎందుకు నిందలు వేస్తున్నారని అడగ్గా గల్లా శివకుమారి, ఆమె కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, ఆయన భార్య ప్రియాంకలను దుర్భాషలాడుతూ చేతులతో కొటారు. దీనిపై బాధిత దంపతుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతిస్థిమితం లేని యువకుడి అదృశ్యం

నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకేసీ కళాశాల రోడ్డులో గల వికాస్ హోటల్ వెనుక ప్రాంతానికి చెందిన పసుపులేటి మోహన్ వెంకట పద్మ తేజ అలియాస్ పింకు (17) అనే మతిస్థిమితం సరిగా లేని యువకుడు అదృశ్యమయ్యాడు. ఇంటి నుంచి వెళ్ళిన సమయంలో సిమెంట్ , బ్లూ, పింక్ కలిసిన రంగు షర్టు , బులుగు ప్యాంటు వేసుకుని, 5 అడుగుల ఎత్తు, ఎరుపు రంగు కలిగి ఉంటాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 8466972295లో గానీ, నల్లపాడు పోలీసులకు 8688831605 నెంబరులోగానీ తెలియజేయాలని కోరారు.

నీటి సంపులో పడి ఒడిస్సా బాలుడి మృతి

ఆడుకుంటూ నీటి సంపులో పడి ఒడిస్సా బాలుడు రాఘవకుమార్ (5) మృతి చెందాడు. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన బాలకు, భారతీదేవి దంపతులు మిర్చియార్డులో కూలి పనుల నిమిత్తం గుంటూరు వచ్చి కొత్తకాలనీలో నివాసం ఉంటున్నారు. ఇంటి సమీపంలో నీటి కోసం సంపు తవ్వారు. అయితే దాని మీద ఎటువంటి అడ్డం పెట్టకపోవడంతో బాలుడు ఆడుకుంటూ వెళ్ళి ప్రమాదవ శాత్తు అందులో జారి పడ్డాడు. ఇది ఎవరూ గమనించలేదు. మధ్యాహ్నం బాలుడు కనిపించకపోవడంతో చుట్టుపక్కల గాలిస్తుండగా సంపులో బాలుడు కనిపించాడు. వెంటనే ఆసుపత్రికి తీసుకువెళ్ళగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

ఎండీయూ వ్యవస్థ రద్దుపై పునరాలోచించాలి

గుంటూరు(తూర్పు), మే 24 (ఆంధ్రజ్యోతి) : ఇంటింటికి రేషన్ పంపిణీ చేసే రేషన్ డోర్ డెలివరీ (ఎండీయూ) వ్యవస్థను రద్దు చేస్తున్నట్లు తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని ప్రభుత్వాన్ని ఆపరేటర్లు, హెల్పర్లు కోరారు. ఎండీయూ వ్యవస్థ రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ శనివారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఇటువంటి అనాలోచిత నిర్ణయంతో దాదాపు 9 వేల మంది ఆపరేటర్లు, మరో తొమ్మిది వేల మంది హెల్పర్లు రోడ్డు పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఉన్న రేషన్ డీలర్ల వ్యవస్థతో పేదలకు బియ్యం, ఇతర సరుకులు అందలేదని ఆరోపించారు. అనంతరం ఇన్‌చార్జ్ కలెక్టర్ ఏ భార్గవ్ తేజకు వినతి పత్రం అందజేశారు. ఆపరేటర్లు, హెల్పర్లు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

మొటిమ గిల్లితే... ప్రాణాంతకంగా మారింది!

● ఇన్‌ఫెక్షన్ కన్ను, మెదడుకు చేరిన వైనం

● వైద్యచికిత్సలతో రక్షించిన శ్రేష్ఠ హాస్పిటల్స్



బాలికతో డాక్టర్ నాగార్జున

గుంటూరు మెడికల్, మే 24 (ఆంధ్రజ్యోతి): ముఖంపై ఏర్పడిన చిన్న మొటిమను బాలిక పిన్నీసుతో గిల్లితే... అది ఇన్‌ఫెక్షన్‌గా మారి మెదడుకు చేరి ప్రాణాంతకంగా పరిణమించింది. సకాలంలో వైద్యులు సమస్యను గుర్తించి చికిత్సలు అందించడంతో బాలిక ప్రాణాలతో బయటపడింది. గుంటూరుకు చెందిన ఎనిమిదవ తరగతి చదువుతున్న బాలికకు ముక్కుపై మొటిమ ఏర్పడింది. ఇబ్బందిగా భావించిన బాలిక పిన్నీసుతో మొటిమను గిల్లింది. ఇది తీవ్రమైన ఇన్‌ఫెక్షన్‌కు దారి తీసింది. వారం పాటు దీనిని పట్టించుకోకపోవడంతో ఇన్‌ఫెక్షన్ వేగంగా వ్యాప్తి చెందింది. మొదట ఇది రెండు కళ్లను ప్రభావితం చేసింది. బైలేట్రల్ ఆర్బిటాల్ సెల్యులైటిస్ అనే సమస్య ఏర్పడ కంటి చూపు తగ్గింది. అనంతరం ఇన్‌ఫెక్షన్ మెదడుకు సోకడంతో కేవర్నస్ సైనస్ థ్రాంబోసిస్ అనే ప్రమాదకరమైన పరిస్థితి ఏర్పడింది. మెదడులో రక్తం గడ్డకట్టి ఒకసారి తేలికపాటి పక్షవాతానికి గురైంది. బాలికను వెంటనే శ్రేష్ఠ హాస్పిటల్స్‌లో చేర్చారు. న్యూరాలజిస్ట్ డాక్టర్ హిమబిందు వ్యాధి నిర్ధారణ చేశారు. మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాగార్జున నేతృత్వంలో న్యూరో క్రిటికల్ కేర్ వైద్య బృందం మెరుగైన వైద్యసేవలు అందించింది. సకాలంలో చికిత్సలు ప్రారంభించడంతో బాలిక రెండు వారాల్లో పూర్తిగా కోలుకోవడంతో డిశ్చార్జీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగార్జున మాట్లాడుతూ ఈ కేసు అందరికీ ఒక గుణపాఠం వంటిదన్నారు. మొటిమలను పిన్నీసులు, ఇతర వస్తువులతో గిల్లడం అత్యంత ప్రమాదకరమన్నారు. ముఖ్యంగా ముక్కు, పై పెదవి ప్రాంతం చుట్టూ ఏర్పడే మొటిమలను గిల్లవద్దని, వైద్యనిపుణులను కలసి తగిన చికిత్సలు పొందాలని ఆయన సూచించారు.

గ్రీస్ దేశంలో ఐటీ, టెలీకాం సర్వీసుల ఉద్యోగాలు

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): గ్రీస్ దేశంలో ఐటీ, టెలీకాం సర్వీసెస్(.యెట్ డెవలపర్స్, ఎంఎస్ ఎస్‌క్యూఎల్ డెవలపర్స్) ఉద్యోగావకాశాలు ఉన్నాయని ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపింది. వయస్సు 35 ఏళ్ల లోపు ఉండి ఐదేళ్ల అనుభవం కలిగిన పురుషులు మాత్రమే అర్హులని పేర్కొన్నది. వేతనం ఇండియన్ కరెన్సీ ప్రకారం ఏడాదికి రూ. 26 లక్షలుగా ఉంటుందన్నారు. రెండేళ్ల కాంట్రాక్టు సమయం ఉంటుందని, కల్లీతియా హెచ్‌క్యూలో ఉద్యోగం చేయాల్సి ఉంటుందని తెలియజేసింది. ఏడాదికి 20 రోజుల సెలువులు కూడా ఉంటాయి. ఎంపిక ప్రక్రియ ఇంగ్లీషు ప్రొఫీషియన్సీ టెస్టు, టెక్నికల్ స్కిల్స్ అసెస్‌మెంట్ ఆధారంగా ఉంటుందని స్పష్టం చేసింది. జూన్ 10వ తేదీ లోపు నైపుణ్యం.ఏపీ.జీవీవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని సూచించింది.

రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్ని జయప్రదం చేయాలి

గుంటూరు(తూర్పు), మే 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికై జూన్ 5న విజయవాడలో జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల్ని జయప్రదం చేయాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ చాంద్ బాషా పిలుపునిచ్చారు. తాడికొండ మండలం, పొన్నెకల్లు గ్రామంలోని పీహెచ్‌సీ వద్ద శనివారం గోడప్రతులను ఆవిష్కరించి ఆయన మాట్లాడారు. ఉద్యోగ సమస్యలే ప్రధాన అజెండాగా నిర్వహిస్తున్న సభకు జిల్లా వ్యాప్తంగా ఉద్యోగులు పెద్దఎత్తున హాజరవ్వాలని కోరారు. సమావేశానికి ముఖ్యమంత్రిని ఆహ్వానించి సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, కోటా సాహెబ్, సుబ్బారావు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కేఎల్‌పీలో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం

గుంటూరు (విద్య), మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్‌పీ పబ్లిక్ స్కూల్‌లో నెల రోజులుగా జరుగుతున్న వేసవి శిక్షణ శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థినీ, విద్యార్థులకు పాఠశాల కార్యదర్శి డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ బహుమతులు అందజేశారు. విద్యార్థులు వేసవి క్రీడా శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని నైపుణ్యాలను పెంపొందించుకోవడం హర్షణీయమని తెలిపారు. ఇటువంటి శిబిరాల వల్ల విద్యార్థులు క్రీడా స్ఫూర్తిని, నాయకత్వం లక్షణాలను పెంపొందించుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జి.రత్తయ్య, ఏవో వెంకటరావు పాల్గొన్నారు.



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్

విద్యుత్ ఇంజనీర్ల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలి

● ఏపీఎస్ఈబీ ఇంజనీర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కేవీ

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ ఇంజనీర్లు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డు ఇంజనీర్స్ అసోసియేషన్ అసోసియేట్ ప్రెసిడెంట్ కే వెంకటరామారావు విజ్ఞప్తి చేశారు. అరండల్‌పేటలోని ఓ హోటల్లో శనివారం అసోసియేషన్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో విద్యుత్ సంస్థలలో పనిచేసే ఇంజనీర్లపై పనిభారం రోజురోజుకు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంజనీర్ల అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ఇప్పటికే ఈనెల 21న ఇంధనశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి సమ్మె నోటీసులు కూడా అందజేయటం జరిగిందని తెలిపారు. ఇంక్రిమెంట్స్ రిలీజ్ చేయాలని, ఎర్న్‌డ్ లీవ్‌లను ఎన్‌క్యాష్‌మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంతో జీపీఎఫ్ సదుపాయాన్ని కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అసోసియేషన్ కార్యదర్శి కే నాగప్రసాద్, ఎమ్ రమేష్, పల్నాడు ఆపరేషన్ సర్కిల్ ఎస్ఈ విజయ్‌కుమార్, గుంటూరు టౌన్-1 ఈఈ తిరుమలశెట్టి శ్రీనివాసబాబు పలువురు అసోసియేషన్ నాయకులున్నారు.



భూమి పూజ చేస్తున్న మేయర్ రవీంద్ర, పక్కన ఎమ్మెల్యే నసీర్ తదితరులు

గుంటూరులో అభివృద్ధికి అగ్ర తాంబూలం

● పది నెలల కాలంలోనే మార్పు దిశగా నగరం

● అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన

గుంటూరు కార్పొరేషన్, మే 24 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రతి వీధిలోనూ అభివృద్ధికి అగ్ర తాంబూలం అందిస్తున్నామని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. నగరంలోని నెహ్రూనగర్ 7 లైను, వెంగళరావు నగర్ 2 లైను, శివనాగరాజు కాలనీ 11 లైన్లలో రూ.2.43 కోట్లతో సీసీ డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యే నసీర్ శంకుస్థాపన చేశారు. మేయర్ కోవెలమూడి రవీంద్రతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ఏ వీధిలోకి వెళ్లినా గుంతల రోడ్లు ఆహ్వానం పలికేవని, తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన కేవలం 10 నెలల్లోనే గుంతల రోడ్లన్నీ పూడ్చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కనకదుర్గ, గుడిపల్లి వాణి, రాజా మాస్టర్, బత్తిని శంకర్, వేములకొండ శ్రీను, గుడిమెట్ల దయారత్నం, ఆనంద్, గోళ్ళ ప్రభాకర్, మహంకాళి నరసింహారావు, కొనకళ్ళ సత్యం, ఎర్ర గోపి నాగేశ్వరరావు, సింధు, కొండూరి కిషోర్, పొదిలి వెంకటేశ్వర్లు, గుండి నరసింహారావు, జానీ, వంగర ఏడుకొండలు, జనసేన నేత పులిగడ్డ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ నేత కరిముల్లా కుటుంబానికి పరామర్శ

'తెలుగుదేశం పార్టీకి కార్యకర్తలే బలం, బలగం.. ఆ కార్యకర్తల కోసమే నిరంతరం మా పోరాటం' అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు, రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా గుండెపోటుతో మరణించారు. శనివారం కరిముల్లా కుటుంబ సభ్యులను పెమ్మసాని రవితో కలిసి ఎమ్మెల్యే నసీర్ పరామర్శించారు. కరిముల్లా కుటుంబ సభ్యులకు టీడీపీ కార్యకర్తల నిధితోపాటు తమ వంతు ఆర్థిక సహాయం కలిపి రూ.6 లక్షలు అందించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో 30 ఏళ్లకుపైగా క్రియాశీలకంగా వ్యవహరించిన కరిముల్లా లేని లోటు పార్టీకి తీర్చలేనిదని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ శంకరి శ్రీనివాస్, ఎల్లావుల అశోక్, డివిజన్ అధ్యక్షులు తాడిపోయిన చిన్న బుజ్జి, మాజీ డిప్యూటీ మేయర్ గౌస్, జాగర్లమూడి శ్రీనివాస్, క్లస్టర్ చెల్లా అంజనేయ ప్రసాద్, జమీర్, వంగరు ఏడుకొండలు, గోల్డ్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

దానాలన్నింటిలో అన్నదానం గొప్పది

● పశ్చిమ ఎమ్మెల్యే మాధవి



ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవి

గుంటూరు కార్పొరేషన్, మే 24(ఆంధ్రజ్యోతి): దానాలన్నింటిలో అన్నదానం గొప్పదని, ప్రతి ఒక్కరు అన్నదానానికి సహకరించాలని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. శనివారం విద్యానగర్ 1వ లైన్‌లోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి వారి దేవస్థానంలో 30వ హనుమాన్ జయంతి వేడుకలలో ఆమె పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమంలో భాగంగా భక్తులకు భోజనం వడ్డించి ప్రారంభించారు. కార్యక్రమంలో స్టాండింగ్ కమిటీ మాజీ చైర్మన్, ఆలయ దర్మకర్త కొల్లి బాలకృష్ణ, ఆలయ ప్రధాన కార్యదర్శి కొల్లి అనిల్ కుమార్, కృష్ణమాచారీ, సత్యనారాయణ శాస్త్రి, కొత్తమాసు శ్రీమన్నారాయణ మూర్తి, కొల్లి అరవింద్ పాల్గొన్నారు.

నేడు టీడీపీ కార్యాలయంలో మహానాడు

● కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య



ముస్తాబైన జిల్లా టీడీపీ కార్యాలయం

గుంటూరు కార్పొరేషన్, మే 24(ఆంధ్రజ్యోతి): నగరంలోని టీడీపీ కార్యాలయం ఆదివారం జరిగే మహానాడుకు సిద్ధమైందని, తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు నిజమైన పండుగ అని కార్యాలయ కార్యదర్శి కంచర్ల శివరామయ్య శనివారం తెలిపారు. శివరామయ్య మాట్లాడుతూ.... నేటి సాయంత్రం 5 గంటలకు, గుంటూరు జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగే జిల్లా మహానాడుకు టీడీపీ జిల్లా కార్యాలయం సుందరంగా తీర్చిదిద్దామన్నారు. జిల్లా మహానాడు కార్యక్రమంలో 14 తీర్మానాలు చేయడం, మరణించిన టీడీపీ నాయకులు, కార్యకర్తలకు సంతాపం తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర మంత్రి, జిల్లా టీడీపీ అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, రాష్ట్ర, జిల్లా కమిటీ సభ్యులు, రాష్ట్ర, జిల్లా కమిటీ అనుబంధ సంఘ సభ్యులు, గుంటూరు కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ పాల్గొంటారని అన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ముగ్గురు కరుడుగట్టిన నేరస్తులపై పీడీ యాక్ట్

● ఆదేశాలు జారీ చేసిన ఇన్‌చార్జ్ కలెక్టర్

● త్వరలో మరికొందరిపైనా... వరుస నేరాల కట్టడికే

గుంటూరు, మే 24 (ఆంధ్రజ్యోతి) : వరుస నేరాలకు పాల్పడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న ముగ్గురిపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. మంగళగిరి టౌన్‌కు చెందిన బుల్లా మనోజ్ (26), వట్టిచెరుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని ముట్లూరు గ్రామానికి చెందిన అల్లం సాయి సాంబశివరావు అలియాస్ సాయి (23), చేబ్రోలు పోలీస్ స్టేషన్ పరిధిలోని వేజండ్లకు చెందిన పోతినేని గోపీ (35)లపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవ తేజ శనివారం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. ఇప్పటికే తెనాలి త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యడ్లలింగయ్య కాలనీకి చెందిన తలవరస విజయబాబు అలియాస్ అప్పు (26)పై పీడీ యాక్ట్ ప్రయోగించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. త్వరలో మరికొందరిపై కూడా పీడీయాక్ట్ ప్రయోగించనున్నట్లు ఎస్పీ తెలిపారు. కలెక్టర్ కార్యాలయానికి ఆయా నిందితుల జాబితా పంపడం జరిగిందన్నారు. ఎస్పీ మాట్లాడుతూ...వీరందరూ మాదకద్రవ్యాల రవాణా, కొట్లాటలు, దొంగతనాలు, దోపిడీలు, అత్యాచారాలు, హత్య ప్రయత్నాలు మొదలగు పలు కేసుల్లో నిందితులుగా ఉన్నారన్నారు. జిల్లాలో ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై ఈ విధంగా పీడీ యాక్టు అమలు చేస్తామన్నారు. తెనాలి త్రీటౌన్ సీఐ రమేష్, వట్టిచెరుకూరు సీఐ రామానాయక్, చేబ్రోలు సీఐ కోటేశ్వరరావు, మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్‌లను ఎస్పీ అభినందించారు.

విధుల్లో చేరిన ఎస్పీ

గుంటూరు మే 24 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ సతీష్ కుమార్ శనివారం రాత్రి విధుల్లో చేరారు. ఈనెల 17న ఆయన వ్యక్తిగత సెలవుపై కుటుంబంతో తమిళనాడు రాష్ట్రంలోని స్వగ్రామం వెళ్లారు. సెలవులు అనంతరం శనివారం రాత్రి ఆయన విధుల్లో చేరారు. ఇప్పటి వరకు బాపట్ల ఎస్పీ తుషార్ డూడీ ఇన్‌చార్జ్‌గా కొనసాగారు.

గుంటూరు రూరల్ వార్తలు

◆ మంగళగిరి ◆ తాడికొండ ◆ ప్రత్తిపాడు

ప్రకృతి వ్యవసాయానికే ప్రాధాన్యం

● మాస్టర్ ట్రైనర్ నాగరాజు

వట్టిచెరుకూరు, మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం ఉత్పత్తులకు రాను రాను ప్రాధాన్యం పెరుగుతుందని, ప్రకృతి వ్యవసాయం ద్వారా ప్రజల ఆరోగ్య భద్రతతో పాటు భూములు కూడా సారవంతంగా ఉంటాయని ప్రకృతి వ్యవసాయ మాస్టర్ ట్రైనర్ గుంటూరు యూనిట్ ఇన్‌చార్జ్ జీ నాగరాజు అన్నారు. మండలంలోని కొర్నెపాడు రైతు సేవా కేంద్రంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రైనర్ నాగరాజు మాట్లాడుతూ భూమిని సారవంతం చేసేలా 20 రకాల విత్తనాలను విత్తన శుద్ధి చేసి ప్రకృతి వ్యవసాయం చేసే రైతులు విత్తుకుంటే వాటి నుంచి వచ్చే పోషకాలతో తదుపరి వేసే పంటల దిగుబడి ఆశాజనకంగా ఉంటుందన్నారు. తెలుగురైతుసేన ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తన డైయిరీ ఫాంలో ఉన్న పశువుల ఎరువును ఉచి తంగా అందిస్తానని ప్రకృతి వ్యవసాయ రైతు విజయకుమార్ వెల్లడించారు. ఈ సందర్భంగా విజయకుమార్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ట్రైనర్ నాగరాజుతో పాటు వట్టిచెరుకూరు మండల ఇన్‌చార్జ్ సాంబశివరావు, వీహెచ్‌ఏ యశోద లక్ష్మి, సీడీఎఫ్ నరసింహారావు, ఐసీఆర్‌పీ ఎస్‌లు పాల్గొన్నారు.

సహజ వనరులు దోచుకునేందుకే..
ఆపరేషన్ కగార్

● అంతర్యుద్ధంతో ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం

● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ



మాట్లాడుతున్న కే రామకృష్ణ, పాల్గొన్న సీపీఐ నాయకులు

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలోని సహజ వనరులను దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై యుద్ధం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆరోపించారు. గుంటూరు, సీపీఐ కార్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కళారుపాల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చర్చలకు మావోస్టులు అంగీకారం తెలిపినా... ఈ యుద్ధం ఎందుకని ప్రశ్నించారు. అటవీ ప్రాంతం నుంచి అదివాసీలను తరిమికొట్టే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న అంతర్యుద్ధం ప్రజలకు ముప్పన్నారు. శవాల కోసం కుటుంబసభ్యులు కోర్టును ఆశ్రయించే పరిస్థితి వచ్చిందని, ఇటువంటి అమానుషం ఎన్నడూ చూడలేదని అన్నారు. నల్లధనం వెనక్కి తీసుకురావడంలో మోదీ విఫలమయ్యారని విమర్శించారు. పహల్గాం ఘటనలో 26 మంది టూరిస్టులను చంపిన టెర్రరిస్టులను పట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిగిన ప్రచారంతో ఒరిగిందేమి లేదన్నారు. వ్యాపార లావాదేవీలు చేయలేమని చెబితే భయపడి ఇరుదేశాలు యుద్ధాన్ని మానుకున్నాయని ట్రంప్ బాహాటంగా చెబుతున్నప్పటికీ మోదీ ఖండించకపోవడం శోచనీయమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్ళు పూర్తి చేసుకున్న సంవత్సరంలో పార్టీ మహాసభలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల మహాసభలు పూర్తి అయిన తరువాత ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుపుకోబోతున్నామని చెప్పారు. ఆపరేషన్ కగార్, ఇతర సమస్యలపై ఆదివారం విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జంగాల అజయ్‌మార్, గని, పులి సాంబశివరావు, రామకృష్ణ, చంద్రనాయక్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు చత్రపతి శివాజీ నాటకం

తెనాలి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): చత్రపతి శివాజీ నాటక ప్రదర్శన ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తారు. శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో నాటకాన్ని ప్రదర్శించనున్నారు. శివాజీ పట్టాభిషేక ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో ఆయన వీరగాథను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సమితి ప్రతినిధులు మైలా హరి, మూర్తి శ్రీనివాస్, హనుమత్ ప్రసాద్ తెలిపారు.

నిద్దరోతున్న గస్తీ

● ద్విచక్ర వాహనాలే లక్ష్యంగా..

● పెరుగుతున్న దొంగతనాలు



ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): కొంత కాలంగా ప్రత్తిపాడు ప్రాంతంలో దొంగతనాలు పెరిగి పోతున్నాయి. పోలీసుల గస్తీ కొరవడటంతో దొంగలు చెలరేగిపోతున్నారు. గొట్టిపాడులోని శివాలయంలో దొంగలు బంగారు ఆభరణాలు అపహరించారు. ద్విచక్ర వాహనాల దొంగతనాలు కూడా పెరిగిపోయాయి. సుమారు నెలన్నర, రెండు నెలల వ్యవధిలోనే సుమారు పదికి పైగా ద్విచక్ర వాహనాలను అపహరించారు. ఇళ్ల ముందు రోడ్లపై పెట్టే వాహనాలే లక్ష్యంగా దొంగలు అపహరిస్తున్నారు. ఒక్క ప్రత్తిపాడులోనే సుమారు ఆరేడు ద్విచక్ర వాహనాలు అపహరణకు గురవగా, యనమదల, వంగిపురంతో పాటు జాతీయ రహదారి వెంబడి కూడా చాలా ద్విచక్ర వాహనాలు అపహరణకు గురయ్యాయి. ప్రత్తిపాడు పోలీసులు మాత్రం ఇంత వరకు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదు. ప్రతి రోజు రాత్రి సమయంలో పోలీసులు గస్తీ తిరగాలి. కానీ ఇటీవల కాలంలో పోలీసులు రాత్రి సమయంలో గస్తీ తిరిగిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రత్తిపాడు సర్కిల్ అయిన తర్వాత సీఐ ప్రత్తిపాడుపై ప్రత్యేక దృష్టి పెడతారనుకున్నారు కాని ఇక్కడ ఇక్కడ అలాంటి పరిస్థితి ఏమీ కనిపించడం లేదు.

హైవే పై గస్తీ
- నాగేంద్ర ఎస్ఐ



రాత్రి పూట గస్తీకి ఇద్దరిని కేటాయిస్తున్నాం. వారు నిత్యం రాత్రి పూట జాతీయ రహదారిపై గస్తీ తిరుగుతున్నారు. ప్రత్తిపాడు గ్రామంలో తిరగని పరిస్థితులు ఉన్నాయి. 16 మంది సిబ్బంది ఉన్నారు.

అభివృద్ధికి కేరాఫ్‌గా మంగళగిరిని తీర్చిదిద్దుతున్న లోకేశ్

● రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య



మోరంపూడిలో ఆర్‌అండ్‌బీ రోడ్డు శంకుస్థాపనలో పాల్గొన్న పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, జబీన్, శ్రీఅనిత తదితరులు

దుగ్గిరాల, మే 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు కేరాఫ్ అడ్రస్‌గా మంగళగిరిని నిలబెడుతున్న మంత్రి నారా లోకేశ్ వెన్నంటి నడవాలని నిలవాలని రాష్ట్ర పద్మశాలీ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య అన్నారు. మండలంలోని మోరంపూడి గ్రామంలో రూ.1.65కోట్లతో 3.2 కి.మీల ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అబద్దయ్య మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని దేశంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని లోకేశ్ కృషిచేస్తున్నారన్నారు. ఎంపీపీ జబీన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. టీడీపీ మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనిత మాట్లాడుతూ, గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలో ఎలాంటి అభివృద్ధి లేక ప్రజలు పడిన ఇబ్బందులు అందరికీ తెలుసునన్నారు. మాజీ ఎంపీపీ వెనిగళ్ల శ్రీకృష్ణప్రసాద్, ఉన్నం ఝాన్సీరాణి, డీసీ చైర్మన్ గొర్నేని అనిల్, తోటకూర సీతారామయ్య, కేసంనేని వాసు, సాదిక్, జంపాల హరి, ప్రసాద్, శంకర్‌నాయక్, ఎంపీడీవో ఏ శ్రీనివాసరావు, ఏఈ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో మహిళలకు ఆర్థికపరిపుష్టి

మహిళలకు ఉపాధితోపాటు, వారిలో ఆర్థిక పరిపుష్టి కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని నందం అబద్దయ్య అన్నారు. పేరుకలపూడిలో బీసీఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సహకారంతో మహిళలకు కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. 200 మందికి పైగా మహిళలు పాల్గొన్న కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగుమహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మి, ప్రధానకార్యదర్శి మంచికలపూడి వైష్ణవి, మండల అధ్యక్షురాలు కేసంనేని శ్రీఅనితలు ప్రసంగించారు. ఎంపీపీ షేక్ జబీన్ మాట్లాడుతూ మూడునెలల కుట్టుశిక్షణ అనంతరం మహిళలకు ఉచితంగా మిషన్‌ను, అందజేస్తామన్నారు. మండల ప్రధానకార్యదర్శి, ఎంపీటీసీ తాళ్ల అశోక్, మాజీ ఎంపీపీలుశ్రీకృష్ణప్రసాద్, ఝాన్సీరాణి, పసుపులేటి సాయిచైతన్య, మైలా వెంకటసుబ్బయ్య, నాగేశ్వరరావు, గొర్నేని అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన శివాలయం ప్రహరీ



కూలిన శివాలయం గోడ

ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): అత్యంత పురాతన దేవస్థానం అయిన ప్రత్తిపాడులోని శ్రీగంగా పార్వతీ సమేత దండేశ్వరస్వామి దేవాలయం ప్రహరీ శుక్రవారం అర్ధరాత్రి సమయంలో కూలిపోయింది. ఈ శివాలయం గ్రామానికి సుమారు ఇరవై అడుగుల ఎత్తులో ఉంటుంది. ఎప్పుడో పురాతన కాలంలో నిర్మించిన కట్టడాలు కావడంతో ఇప్పటికే మూడు పక్కల ఉన్న గోడలు నాని పడిపోయాయి. వారి స్థానంలో కొత్తగా గోడ నిర్మాణం చేశారు. వారం రోజులుగా కురుస్తున్న వానల కారణంగా దేవస్థానం తూర్పు ప్రహరీ నేలకొరిగి పోయింది. అయితే రాత్రి పూట కావడంతో జనసంచారం లేని కారణంగా ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఉదయాన్నే దేవాలయానికి వచ్చిన ఆలయ అర్చకులు పరమేశ్వరరావు గోడ కూలిన విషయాన్ని చూసి వెంటనే దేవదాయశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు.

పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది

● ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు



చిల్లపల్లి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న పసుపు రైతులు

మంగళగిరి సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్ స్టోరేజీలో గతేడాది జరిగిన అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పసుపు రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. అగ్ని ప్రమాదంలో నష్టపోయిన రైతులు, వ్యాపారులు శనివారం మంగళగిరి జనసేన కార్యాలయంలో చిల్లపల్లిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు కూటమి ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేశ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామని ఆయన భరోసా ఇచ్చారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న టీడీపీ నాయకులు

మంగళగిరి సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి పట్టణానికి చెందిన ముగ్గురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి కింద మంజూరైన చెక్కులను స్థానిక టీడీపీ నేతలు శనివారం పంపిణీ చేశారు. కుప్పరావు కాలనీకి చెందిన గుంటి శివనాగేశ్వరరావుకు రూ.1,04,650, పీఎంఏవై ఎన్టీఆర్ నగర్ (టిడ్కో)కు చెందిన మననం లక్ష్మీకాంతంకు రూ.42,200, భగత్‌సింగ్ నగర్‌కు చెందిన షేక్ ముబీనాకు రూ.60 వేల విలువైన చెక్కులను లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేశారు. సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్దుల్ మజీద్, నేతలు ఊట్ల శ్రీమన్నారాయణ, పందేటి తిరుపతయ్య, గంజి చంద్రశేఖర్‌రావు, మాచర్ల శ్రీనివాసరావు, గుంటి నాగరాజు, మంద్రు రాంబాబు, వెలుగోటి అన్నపూర్ణ, ఆకురాతి జయలక్ష్మీ, రాయపాటి విజయ్, బూదాటి శ్రీనివాసరావు, కొల్లి శ్రీనివాసరావు, ఇండ్ల రజని, పొదిలి హరిబాబు, కేసనం సాయిభావన తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కౌన్సిల్ సమావేశం



చలో విజయవాడ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉద్యోగుల సంఘం నాయకులు

తాడికొండ(పొన్నెకల్లు), మే 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి జూన్ 5వ తేదీన విజయవాడలో కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చాంద్ బాష తెలిపారు. శనివారం పొన్నెకల్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ఉద్యోగుల మద్దతు కోసం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5వ తేదీన రాష్ట్ర 3వ కౌన్సిల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లు, అందరి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఉద్యోగులకు మేలు చేస్తామని తెలిపారు. అనంతరం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోటా సాహెబ్, తాడికొండ తాలుకా యూనిట్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని పర్యవేక్షిస్తున్న వల్లభనేని వెంకట్రావు

తాడేపల్లి టౌన్, మే 24 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం వ్యవస్థాపకుడు ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా మంత్రి నారా లోకేశ్ స్ఫూర్తితో టీడీపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత కంటి వైద్య శిబిరం పార్టీ పట్టణ కార్యాలయం వద్ద నిర్వహించారు. అమరావతి కంటి ఆసుపత్రి విజయవాడ వారి ఆధ్వర్యంలో జరిగిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని పట్టణ అధ్యక్షుడు వల్లభనేని వెంకట్రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సుమారు 200 మంది కంటి పరీక్షలు చేయించుకోగా 37 మందికి శుక్లం ఆపరేషన్లు ఐదుగురికి పొర ఆపరేషన్లు, 26 మందికి కళ్లజోళ్లు అవసరమైనట్టు తెలిపారు. కంటి చికిత్స కోసం ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయమని వెంకట్రావు అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు దారా దాసు, గొర్ల వేణుగోపాల్ రెడ్డి, మండవ గోపాలరావు, అద్దంకి మురళి, ఇట్టా పెంచలయ్య, మేకా పుల్లారెడ్డి, కేళి వెంకటేశ్వరరావు, కొర్రపాటి విజయ్, భాస్కరరావు, నాగేశ్వరరావు, కే మహాలక్ష్మి, అన్నెం కుసుమ, హరికృష్ణ, దుర్గారావు, అమరావతి కంటి ఆస్పత్రి వైద్యులు, డాక్టర్ ఆలి, పలగాని కోటి రత్నం, స్వరూప్ సౌమ్య పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



ర్యాలీలో పాల్గొన్న ఎక్సైజ్ శాఖ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు

మంగళగిరి, మే 24 (ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ మంగళగిరి సీఐ జీ వీరాంజనేయులు కోరారు. మాదక ద్రవ్యాల వలన కలిగే అనర్థాలను తెలియజేస్తూ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో శనివారం ఎర్రబాలెం స్పెన్సర్ సెంటర్లో విద్యార్థులతో కలిసి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంగళగిరి నిర్మల కళాశాలలో అవగాహనా సదస్సు నిర్వహించారు. యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదక ద్రవ్యాల వినియోగాన్ని పూర్తిగా రూపుమాపేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి నాలుగో శనివారం మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గురించి ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎక్సైజ్ స్టేషన్ ఎస్ఐలు ఎ.పద్మజ, కే రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు



విద్యార్థిని అభినందిస్తున్న పాలకవర్గ సభ్యులు

పెదనందిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక నంది పాఠశాలలో పది పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని ఎన్ స్నేహితను పాలకవర్గ సభ్యులు శనివారం అభినందించారు. ఇటీవల పది ఫలితాల్లో 588 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలవగా, రీవెరిఫికేషన్‌లో మరో రెండు మార్కులు అదనంగా రావడంతో 590 మార్కులు సాధించడంతో పాటు, మరో నలుగురు విద్యార్థులు కూడ అదనపు మార్కులు సాధించినట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా పాలకవర్గ అధ్యక్షుడు కాళహస్తి సత్యనారాయణ (విశ్రాంత డీఎస్పీ) మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన నాటి నుంచి విద్యార్థుల నూరుశాతం ఫలితాలతో పాటు ప్రథమ స్థానంలో నిలిచేందుకు కృషి చేస్తున్న ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో సభ్యులు నర్రా బాలకృష్ణ, నర్రా వీరయ్య, లావు ఆదిశేషయ్య, ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య, సత్యనారాయణలు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిలో చెత్త వేస్తే జరిమానా

● దుకాణదారులకు నోటీసులు జారీ చేసిన పంచాయతీ



దుకాణదారులకు నోటీసులు అందజేస్తున్న పంచాయతీ సిబ్బంది

ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ ప్రధాన కేంద్రమైన ప్రత్తిపాడులో పారిశుధ్యంపై పంచాయతీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. కూటమి ప్రభుత్వం గ్రామాల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన నేపథ్యంలో ప్రధాన రహదారిపై ఎలాంటి చెత్త లేకుండా ఉండాలనే ప్రత్తిపాడు పంచాయతీ అధికారులు రోడ్డుపై చెత్తవేసే పద్ధతికి స్వస్తి చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తొలుత ప్రధాన రహదారిలో ఉన్న దుకాణదారులందరికీ నోటీసులు అందించారు. 25వ తేదీ నుంచి పంచాయతీ బండి వచ్చినప్పుడు మాత్రమే చెత్తను అందులో వేయాలని, రోడ్డుపై చెత్త వేస్తే జరిమానా విధిస్తామని పంచాయతీ కార్యదర్శి ఖాజావలి తెలిపారు. ప్రతి రోజు మధ్యాహ్నం సమయంలో చెత్త బండి ప్రధాన రహదారిపై తిరుగుతుందన్నారు.

టీడీపీ సీనియర్ నాయకుడు గాడిపర్తి శ్రీనివాసరావు మృతి



గాడిపర్తి శ్రీనివాసరావు (ఫైల్ ఫొటో)

తాడేపల్లి (ఉండవల్లి), మే 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు గాడిపర్తి శ్రీనివాసరావు (59) శనివారం తెల్లవారుజామున ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య, వివాహమైన ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. తొలి నుంచి మంగళగిరిలో ఉండే శ్రీనివాసరావు, కొంతకాలంగా ఉండవల్లిలోని అపార్టుమెంటులో ఉంటున్నారు. ఆనాటి మాజీ మంత్రి డాక్టర్ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావుతో సన్నిహితంగా ఉంటూ పార్టీ అభ్యున్నతికి విశేషంగా పార్టీ ఆవిర్భావం నుంచి పని చేశారు. తుది శ్వాస విడిచే వరకు పార్టీపట్ల అంకితభావంతో ఉన్నారు. శ్రీనివాసరావు మృతివార్త తెలిసిన వెంటనే నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపి శ్రేణులు స్నేహితులు, ఉండవల్లిలోని శ్రీనివాసరావు నివాసం వద్దకు వెళ్లి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. శ్రీనివాసరావు అంత్యక్రియలు ఆదివారం ఉదయం నిర్వహిస్తామని కుటుంబసభ్యులు తెలిపారు.



శృంగారపురం గ్రామంలో అనారోగ్యతో బాధపడుతున్న మొవ్వా సుబ్బారావుకు వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ.3.55లక్షల సీఎం సహాయ నిధి నగదు చెక్కును శనివారం అందించారు. గుండె శస్త్రచికిత్స కోసం నగదు మంజూరు చేసినందుకు గానూ మంత్రి నారా లోకేశ్‌కు సుబ్బారావు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. కేసంనేని శ్రీఅనిత, ఎం చంద్ర శేఖరరావు, యలవర్తి అంకమయ్య, జూపల్లి వెంకటేశ్వరరావు, మహేష్, వెంకట్రావు, మధుబాబు, ఆదిశేష తదితరులు పాల్గొన్నారు.

- (దుగ్గిరాల, ఆంధ్రజ్యోతి)

నాలుగు రోజులుగా హౌసింగ్ కార్యాలయం మూత

● పట్టించుకోని ఉన్నతాధికారులు

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు



తాళాలు వేసి ఉన్న హౌసింగ్ కార్యాలయం


ప్రత్తిపాడు, మే 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు రోజులుగా ప్రత్తిపాడులోని హౌసింగ్ కార్యాలయం పూర్తిగా మూతపడి ఉంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపమో.. లేక మరే ఇతర కారణాలో కాని ఇటీవల కాలంలో హౌసింగ్ కార్యాలయం తాళాలు కూడా తీయకుండా మూత వేసి ఉండటం పరిపాటిగా మారింది. ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రభుత్వ కార్యాలయాలను పనివేళల్లో మూసి వేయడానికి వీల్లేదు. ఇలా మూసి వేయడాన్ని ఉన్నతాధికారులు చాలా సీరియస్‌గా పరిగణిస్తారు. అలాంటిది ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉన్న హౌసింగ్ కార్యాలయం నాలుగు రోజులుగా తీయకండా మూతవేసి ఉన్నా ఎవరూ కూడా పట్టించుకున్న దాఖలాలు లేవు. గతంలో ప్రత్తిపాడులోనే ప్రత్తిపాడు హౌసింగ్ డీఈ కార్యాలయం ఉండేది. అయితే గత ప్రభుత్వంలో ప్రత్తిపాడులో ఉన్న డీఈ కార్యాలయాన్ని గుంటూరుకు మార్చేశారు. దీంతో ప్రత్తిపాడు సిబ్బంది వివిద రకాల కారణాలు చెపుతూ ఏకంగా కార్యాలయాన్ని మూత వేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో హౌసింగ్ పథకానికి ప్రాధాన్యం ఉన్నది. ఈ నేపథ్యంలో నిత్యం అధికసంఖ్యలో వివిద పనుల కోసం కార్యాలయాలకు వచ్చే వారి సంఖ్య ఎక్కువగా ఉంటుంది. వరుసగా కార్యాలయం మూతవేసి ఉండటంతో ప్రజలకు ఏమి జరుగుతుందో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

తెనాలి మారీసుపేట, మే 22 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు విఫలయత్నం చేసిన ఘటన పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక కొత్తపేటలోని ఎస్‌బీఐ ఏటీఎంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దుండగులు ఏటీఎంను పగులగొట్టి నగదు చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అలారం మోగింది. దీనితో దుండగులు ఏటీఎంను వదలి పరారయ్యారు. శనివారం ఎస్‌బీఐ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

వైభవంగా హుళిగమ్మదేవి తిరునాళ్ల

చేబ్రోలు(పొన్నూరు టౌన్), మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేకూరులో ఉన్న శ్రీ హుళిగమ్మదేవి అమ్మవారి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీధర్మ శాస్త్ర పీఠంలో కొలువుదీరి ఉన్న శ్రీహుళిగమ్మదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం తిరునాళ్లను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, పూజా ద్రవ్యాలతో అభిషేక పూజలు జరిపి గాజులతో అలంకరించారు. పరిసర ప్రాంతాల నుంచే కాక తెలుగురాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తిరునాళ్లకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.



గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న హుళిగమ్మదేవి అమ్మవారు

అనంతపురం జిల్లాకు ఎన్టీఆర్ విగ్రహాలు



తయారైన ఎన్టీఆర్ విగ్రహాలు

తెనాలి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాలు తెనాలి శిల్పశాలలో రూపుదిద్దుకున్నాయి. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అనంతపురం జిల్లాలో ప్రతిష్ఠించేందుకు టీడీపీ నాయకులు ఆర్డర్ ఇచ్చారని శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా జిల్లాల నుంచి శిల్పాల కోసం ఆర్డర్లు వస్తున్నాయన్నారు. ఫైబర్, కాంస్య విగ్రహాలు తయారు చేశామని చెప్పారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు



నేడు చత్రపతి శివాజీ నాటకం

తెనాలి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): చత్రపతి శివాజీ నాటక ప్రదర్శన ఆదివారం తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో ప్రదర్శిస్తారు. శివాజీ స్మారక సమితి, హిందూ చైతన్యవేదిక ఆధ్వర్యంలో నాటకాన్ని ప్రదర్శించనున్నారు. శివాజీ పట్టాభిషేక ఉత్సవాలు దేశ వ్యాప్తంగా జరుగుతున్న నేపథ్యంలో ఆయన వీరగాథను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సమితి ప్రతినిధులు షైలా హరి, మూర్తి శ్రీనివాస్, హనుమత్ ప్రసాద్ తెలిపారు.



గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిస్తున్న హులిగమ్మదేవి అమ్మవారు

వైభవంగా హులిగమ్మదేవి తిరునాళ్ల

చేబ్రోలు(పొన్నూరు టౌన్), మే 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేకూరులో ఉన్న శ్రీ హులిగమ్మదేవి అమ్మవారి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. గ్రామంలో శ్రీధర్మశాస్త్ర పీఠంలో కొలువుదీరి ఉన్న శ్రీహులిగమ్మదేవి అమ్మవారి ఆలయంలో శుక్రవారం తిరునాళ్లను పురస్కరించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారికి పసుపు, కుంకుమలు, పూజా ద్రవ్యాలతో అభిషేక పూజలు జరిపి గాజులతో అలంకరించారు. పరిసర ప్రాంతాల నుండే కాక తెలుగురాష్ట్రాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో తిరునాళ్లకు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వివిధ గ్రామాల నుండి ఆలయానికి పెద్దసంఖ్యలో ప్రభలు తరలివచ్చాయి. విద్యుత్ ప్రభలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆలయ ధర్మకర్త గురుస్వామి గుంటుపల్లి శ్రీనివాసరరావు పర్యవేక్షణలో పూజాకార్యక్రమాలు జరిగాయి.

ఏటీఎంలో చోరీకి విఫలయత్నం

● అలారం మోగడంతో దుండగులు పరార్

తెనాలి మారీసుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): ఏటీఎంలో చోరీకి గుర్తు తెలియని వ్యక్తులు విఫలయత్నం చేసిన ఘటన పట్టణంలో జరిగింది. వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు.. స్థానిక కొత్తపేటలోని ఎస్‌బీఐ ఏటీఎంలో శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత దుండగులు ఏటీఎంను పగులగొట్టి నగదు చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా అలారం మోగింది. దీనితో దుండగులు ఏటీఎంను వదలి పరారయ్యారు. శనివారం ఎస్‌బీఐ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాలు ప్రారంభం

తెనాలి అర్బన్, మే 24 (ఆంధ్రజ్యోతి): షరాఫ్ బజారులోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలలో లక్ష హనుమాన్ చాలీసా కూడా భక్తులు చేపట్టారు. స్వామి వారికి విశేష పూజలు, మన్యసూక్త హోమం, సిందూరార్చన నిర్వహించారు. 11 రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయని ఈవో శ్రీనివాసరెడ్డి కోరారు. ప్రతిరోజు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ జరుగుతుందని అర్చకులు శ్రీనివాసమూర్తి తెలిపారు. పారాయణలో పాల్గొనే భక్తులు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. అర్చకులు కిరణ్‌కుమార్, సురేష్, కౌన్సిలర్ త్రిమూర్తి, సంకీర్తన బృందం సభ్యులు అనూరాధ, బాలకృష్ణ, వెంకటేశ్వరరావు, వెంకటేష్, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక విధానాలకు పాల్పడవద్దు: సీఐ



ట్రాన్స్‌జెండర్‌లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ వీరానాయక్

పొన్నూరుటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): చట్ట వ్యతిరేక విధనాలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని అర్బన్ సీఐ వీరానాయక్ అన్నారు. శనివారం అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్‌లకు సీఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. పొన్నూరులో ప్రజల నుంచి బలవంతంగా నగదు వసూలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ప్రజల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ట్రాన్స్‌జెండర్‌లను హెచ్చరించి బైండోవర్ చేశారు.

పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికే ప్రాధాన్యం



పరిహారం చెక్కు అందజేస్తున్న సంగం డెయిరీ డైరెక్టర్ రామారావు

పొన్నూరుటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారుల సంక్షేమానికి సంగం పాలక వర్గం ప్రాధాన్యం ఇస్తుందని పాలకవర్గ సభ్యుడు బొర్రు రామారావు అన్నారు. శనివారం మండలంలోని గోళ్లమూడిపాడులో పాల రైతు కుటుంబానికి పరిహారం అందజేశారు. గ్రామానికి చెందిన కొండేపి మునలయ్య అనే పాల రైతు మృతిచెందగా సంగం డీవీసీ అభయ పాల ఉత్పత్తిదారుల వెల్ఫేర్ పథకం కింద చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్ రూ.50వేల నగదు పరిహారం మంజూరు చేశారు. అలాగే మట్టి ఖర్చుల కింద రూ.10వేలు విడుదల చేశారు. ఈ నగదును మునలయ్య భార్య సామ్రాజ్యంకు డైరెక్టర్ రామారావు అందించారు. కార్యక్రమంలో అంగిరేకుల వెంకటేశ్వర్లు, ఉప్పల సాంబశివరావు, సంగం అధికారులు పాల్గొన్నారు.

కొత్తగూడెం ఎమ్మెల్యేకు సన్మానం

పొన్నూరుటౌన్, మే 24(ఆంధ్రజ్యోతి): పొన్నూరు ప్రాంతానికి చెందిన తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును పొన్నూరు కాంగ్రెస్ నాయకులు కలిసి సత్కరించారు. ఎమ్మెల్యే కూనంనేని స్వగ్రామం సంగుపాలెం కోడూరు విచ్చేయడానికి పొన్నూరు రాగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఏ దిలీప్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు కూనంనేని సాంబశివరావును కలిసి సత్కరించారు. కార్యక్రమంలో పొన్నూరు కాంగ్రెస్ నాయకులు తాడిశెట్టి సాంబయ్య, బొందలపాటి శ్రీను, రాజేష్, ఫణి, రేవంత్ పాల్గొన్నారు.

బాబోయ్.. కుక్కలు

● తెనాలిలో కుక్కల స్వైరవిహారం
● ఒంటరిగా వెళ్లే పిల్లలు, పెద్దలపై దాడులు
● పెరిగిపోతున్న కుక్కకాటు కేసులు
● కుక్కల నియంత్రణకు తూతూమంత్రం చర్యలతో సరిపెడుతున్న మునిసిపాలిటీ





గుంపులుగా తిరుగుతున్న వీధికుక్కలు, ఇన్‌సెట్‌లో జిల్లా వైద్యశాలలో కుక్కకాటు బాధితుడికి వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

తెనాలి మారీసుపేట, మే 24 (ఆంధ్రజ్యోతి): తెనాలిలో కుక్కలు పిక్కలు పీకుతున్నాయి. ఏ వీధిలో చూసినా శునకాలు మందలు మందలుగా సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వేసవి కాలం కావడంతో విద్యాలయాలకు సెలవుల నేపథ్యంలో చిన్నారులు ఆటలాడుతూ వీధుల వెంట తిరుగుతున్నారు. ఈ క్రమంలో ఆయా వీధుల్లో ఉన్న కుక్కలు చిన్నారులపై దాడికి పాల్పడుతున్నాయి. కుక్కకాటుకి గురికావడంతో పిల్లల తల్లిదండ్రులు ఆందోళన చెందుతూ వైద్యశాలల బాట పడుతున్నారు. ఇదిలా ఉంటే రాత్రి వేళల్లో వాహనాలపై వెళ్లే వారిపై కుక్కలు ఎగబడుతున్నాయి. వాటి నుంచి తప్పించుకునే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారినపడి గాయాలపాలవుతున్నారు. ఒంటరిగా పనుల కోసం ప్రజలు వీధుల్లోకి వెళ్లాలంటేనే వెనకంజవేసే పరిస్థితి నెలకొంది. మారీసుపేటలో వెంకటేశ్వరావు కుక్కల దాడి నుంచి తప్పించుకోగా, సుల్తానాబాదులో రాజునాయక్ తనను వెంబడించిన కుక్కల నుంచి తప్పించుకోబోయి ముందుకు పడి గాయపడిన ఘటన గతంలో జరిగింది. బాలాజీరావు పేటలో ఆడుకుంటున్న ఐదేళ్ల చిన్నారిని కుక్కల గుంపు దాడి చేయగా గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందింది. ఐతానగర్ జేపీ నగర్‌లో ద్విచక్రవాహనంపై వెళ్తున్న శ్రీనివాసరావుపై కుక్క దాడికి ప్రయత్నించడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. తాజాగా పినపాడు పాండురంగ పేటలలో కట్టివేసిన ఐదు దూడలపై దాడిచేసి కొరికి ప్రాణాలు తీయడం సంచలనంగా మారింది. ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ వార్డు పర్యటనలో ప్రజలు, కౌన్సిలర్లు వీధి కుక్కల బెడదల నుండి కాపాడాలంటూ మంత్రికే విన్నవించారు. ప్రతి సోమవారం గ్రీవెన్స్‌కు కూడా వీధికుక్కల సమస్యపై పెద్దఎత్తున వినతులు వస్తున్నాయి. మంత్రి మనోహర్ కుక్కల నియంత్రణ కోసం ఏర్పాటుచేసిన శస్త్ర చికిత్సల విభాగాన్ని పరిశీలించి వాటి నియంత్రణకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అయినా ఫలితం లేకపోయింది. తెనాలి జిల్లా వైద్యశాల, పట్టణంలో పలు ఆరోగ్య కేంద్రాలకు కుక్కకాటు చికిత్సకు వెళ్లే బాధితులు రోజురోజుకు పెరుగుతుడటంతో వైద్యశాలలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి వైద్యసేవలు అందించడం పరిపాటిగా మారింది. ప్రతిరోజు సుమారు 50 మంది యాంటిరెబీస్ వ్యాక్సిన్ కోసం వస్తున్నారంటే కుక్కల దాడులు పట్టణంలో ఎంత ఉధృతంగా ఉందో అర్థమవుతుందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు సమస్యను పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రీసర్వేపై ఆందోళన వద్దు

● సమస్యలున్నా సత్వరం పరిష్కరిస్తాం
● రీసర్వే డీటీ ఎంవీఎస్ ప్రసాద్



రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న డీటీ ప్రసాద్

తెనాలిరూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టిన రీసర్వేలో సమస్యలున్న రైతులు ఆందోళన చెందవద్దని నిర్ణీత సమయంలో పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ ఎంవీఎస్ ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని పెద రావూరులో రీసర్వేపై రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రీసర్వే ద్వారా పొందుపరిచిన రికార్డులను గ్రామంలో రైతులు పరిశీలించుకునేందుకు అందుబాటులో ఉంచి అభ్యంతరాలున్న రైతుల నుండి అర్జీలు స్వీకరించారు. 42 మంది రైతులు వివిధ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. రైతులు తెలిపిన ప్రతి సమస్యను సత్వర పరిష్కారానికి కృషి చేస్తామని అధికారులు తెలిపారు. డీటీ ప్రసాద్ మాట్లాడుతూ పెదరావూరు గ్రామాన్ని రీసర్వేకి పైలెట్ గ్రామంగా ఎంపికచేశామన్నారు. అందులో భాగంగా సర్వే పూర్తయిన రైతుల నుండి సమస్యలుంటే నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు గ్రామ సభ నిర్వహిస్తున్నామన్నారు. రీసర్వేతో సమస్యల పరిష్కారంతో పాటు డిజిటల్ రికార్డులు సైతం అందుబాటులోకి వస్తాయన్నారు. సర్వే పూర్తి చేసిన రైతుల వివరాల రికార్డులు ఆదివారం కూడా గ్రామంలో అందుబాటులో ఉంచుతామని రైతులు వాటిని పరిశీలించి అభ్యంతరాలున్నవారు అధికారుల దృష్టికి తెస్తే త్వరగా పరిష్కరిస్తామన్నారు. డివిజనల్ ఐఓఎస్ ఎం పార్థసారధి, మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీఆర్వోలు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

● మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న



అధికారులకు సూచనలు చేస్తున్న కమిషనర్ శేషన్న తదితరులు

తెనాలి మారీసుపేట, మే 24(ఆంధ్రజ్యోతి): జూన్ 21న జరిగే అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మునిసిపల్ కమిషనర్ బండి శేషన్న అన్నారు. శనివారం స్థానిక బోసురోడ్డులోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థాన ప్రాంగణంలో ఏర్పాటుచేసిన యోగా శిక్షణ శిబిరాన్ని మునిసిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 21వ తేదీ నుండి జూన్ 21 వరకు యోగాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ప్రత్యేక శిక్షణ శిబిరంలో ట్రైనర్లకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మునిసిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అనంతపురం జిల్లాకు ఎన్టీఆర్ విగ్రహాలు



తయారైన ఎన్టీఆర్ విగ్రహాలు

తెనాలి అర్బన్, మే 24(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ విగ్రహాలు తెనాలి శిల్పశాలలో రూపుదిద్దుకున్నాయి. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా అనంతపురం జిల్లాలో ప్రతిష్ఠించేందుకు టీడీపీ నాయకులు ఆర్డర్ ఇచ్చారని శిల్పి కాటూరి వెంకటేశ్వరరావు తెలిపారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా జిల్లాల నుంచి శిల్పాల కోసం ఆర్డర్లు వస్తున్నాయన్నారు. ఫైబర్, కాంస్య విగ్రహాలు తయారు చేశామని చెప్పారు.

రేషన్‌కార్డు దరఖాస్తులను పరిశీలించాలి

● ఎంపీడీవో విజయలక్ష్మి

కొల్లిపర, మే 24(ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులు రేషన్‌కార్డు కొరకు పెట్టుకున్న ప్రతి దరఖాస్తును తప్పకుండా పరిశీలించాలని ఎంపీడీవో విజయలక్ష్మి అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్లతో కొత్త రేషన్‌కార్డులపై ఆమె సమీక్ష నిర్వహించారు. రేషన్‌కార్డుల నమోదుపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అర్హులైన వారందరికి తప్పని సరిగా రేషన్‌కార్డు ఇవ్వాలని, వారి దరఖాస్తును ఆన్‌లైన్ చేయాలన్నారు. రేషన్‌కార్డు దరఖాస్తుకు గడువు అనేది లేదని ఎప్పుడైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సమావేశంలో పరిపాలనాధికారి ప్రతాప్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో విజయలక్ష్మి

ముగ్గురు కరుడుగట్టిన నేరస్తులపై పీడీ యాక్ట్

● ఆదేశాలు జారీచేసిన ఇన్‌చార్జ్ కలెక్టర్

గుంటూరు, మే 24(ఆంధ్రజ్యోతి): వరుస నేరాలకు పాల్పడుతున్న ముగ్గురిపై పోలీసులు పీడీ యాక్ట్ ప్రయోగించారు. మంగళగిరికి చెందిన బుల్లా మనోజ్(26), వట్టిచెరుకూరు మండలం ముట్లూరుకి చెందిన అల్లం సాయి సాంబశివరావు(23), చేబ్రోలు మండలం వేజండ్లకు చెందిన పోతినేని గోపీ(35)లపై పీడీ యాక్ట్ ప్రయోగించినట్లు ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ భార్గవతేజ శనివారం ఉత్తర్వులు జారీచేసినట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటికే తెనాలి త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యడ్లలింగయ్య కాలనీకి చెందిన తలవరస విజయబాబు (26)పై పీడీ యాక్ట్ ప్రయోగించి రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. త్వరలో మరికొందరిపై కూడా పీడీయాక్ట్ ప్రయోగించనున్నట్లు ఎస్పీ తెలిపారు. కలెక్టర్ కార్యాలయానికి ఆయా నిందితుల జాబితా పంపడం జరిగిందన్నారు. ఇప్పటికే మరికొందరిపై కూడా పీడీ చట్టం ప్రయోగానికి ప్రతిపాదనలు పంపామని, ఉత్తర్వులు వచ్చిన వెంటనే పీడీ చట్టం అమలుచేస్తామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపైనా పీడీ చట్టం ప్రయోగిస్తామని ఎస్పీ హెచ్చరించారు.



మాట్లాడుతున్న కే రామకృష్ణ, పాల్గొన్న సీపీఐ నాయకులు

సహజ వనరులు దోచుకునేందుకే.. ఆపరేషన్ కగార్

● అంతర్యుద్ధంతో ప్రజలకు ముప్పు వాటిల్లే ప్రమాదం
● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ

గుంటూరు(తూర్పు), మే 24(ఆంధ్రజ్యోతి): అటవీ ప్రాంతంలోని సహజ వనరులను దోచుకోవడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులపై యుద్ధం చేస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ ఆరోపించారు. గుంటూరు, సీపీఐ కార్యాలయంలో జరుగుతున్న రాష్ట్ర స్థాయి కళారుపాల శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చర్చలకు మావోస్టులు అంగీకారం తెలిపినా... ఈ యుద్ధం ఎందుకని ప్రశ్నించారు. అటవీ ప్రాంతం నుంచి ఆదివాసీలను తరిమికొట్టే ప్రయత్నం జరుగుతుందని ఆరోపించారు. ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న అంతర్యుద్ధం ప్రజలకు ముప్పన్నారు. శవాల కోసం కుటుంబసభ్యులు కోర్టును ఆశ్రయించే పరిస్థితి వచ్చిందని, ఇటువంటి అమానుషం ఎన్నడూ చూడలేదని అన్నారు. నల్లధనం వెనక్కి తీసుకురావడంలో మోదీ విఫలమయ్యారని విమర్శించారు. పహల్గాం ఘటనలో 26 మంది టూరిస్టులను చంపిన టెర్రరిస్టులను పట్టుకోలేకపోయారని ఎద్దేవా చేశారు. ఆపరేషన్ సిందూర్ పేరుతో జరిగిన ప్రచారంతో ఒరిగిందేమి లేదన్నారు. వ్యాపార లావాదేవీలు చేయలేమని చెబితే భయపడి ఇరుదేశాలు యుద్ధాన్ని మానుకున్నాయని ట్రంప్ బాహాటంగా చెబుతున్నప్పటికీ మోదీ ఖండించకపోవడం శోచనీయమన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆవిర్భవించి వందేళ్ళు పూర్తి చేసుకున్న సంవత్సరంలో పార్టీ మహాసభలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంలోని 26 జిల్లాల మహాసభలు పూర్తి అయిన తరువాత ఆగస్టు 23, 24, 25 తేదీలలో ఒంగోలులో రాష్ట్ర మహాసభలు జరుపుకోబోతున్నామని చెప్పారు. ఆపరేషన్ కగార్, ఇతర సమస్యలపై ఆదివారం విజయవాడలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జంగాల అజయ్‌మార్, గని, పులి సాంబశివరావు, రామకృష్ణ, చంద్రనాయక్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న సమీర్‌కుమార్, పాల్గొన్న మండల స్థాయి టీం సభ్యులు

బాల్య వివాహాల రహిత మండలంగా తెనాలిని తీర్చిదిద్దుకుందాం

● క్రాఫ్ జిల్లా సమన్వయకర్త కోలా సమీర్‌కుమార్

తెనాలి రూరల్, మే 24(ఆంధ్రజ్యోతి): బాల్యవివాహాల రహిత మండలంగా తెనాలిని తీర్చిదిద్దుకుందామని చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్(క్రాఫ్) జిల్లా సమన్వయకర్త కోలా సమీర్‌కుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించిన బాల్య వివాహాలు, బాలకార్మికుల నిరోధక చట్టంపై మండల స్థాయి టీంలతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సమీర్‌కుమార్ మాట్లాడుతూ బాల్యవివాహాల నిరోధక చట్టాన్ని అతిక్రమించే వారిపై చట్టప్రకారం చర్యలుంటాయన్నారు. అందులో జైలు శిక్ష, రూ.1లక్ష నుండి రూ.5లక్షల వరకూ జరిమానా విధిస్తారన్నారు. అలాగే బడికి వెళ్లాల్సిన వయసులోని చిన్నారులను పనిలో పెట్టుకునే యజమానులకు సైతం జైలుశిక్ష, జరిమానాలుంటాయన్నారు. వ్యాపారులు ఎట్టిపరిస్థితుల్లో మైనర్లను పనిలో పెట్టుకోకూడదన్నారు. బాలికలపై జరిగే లైంగిక వేధింపులు, పోక్సో చట్టం గురించి వివరించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సౌజన్యశ్రీ, పలువురు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మహిళాపోలీసులు, క్రాఫ్ సర్వీస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటు చేసుకోవాలి

● డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి

కొల్లిపర, మే 24(ఆంధ్రజ్యోతి): డ్వాక్రా మహిళలు ప్రతి నెలా సమావేశాన్ని ఏర్పాటుచేసుకోవడం మంచిదని డీఆర్‌డీఏ ఏపీఎం రమాదేవి అన్నారు. శనివారం స్థానిక స్త్రీశక్తి భవనంలో యానిమేటర్లకు, పొదుపు సంఘాల సభ్యులకు ఆమె సమీక్ష నిర్వహించారు. పొదుపు సంఘాల సభ్యులకు బ్యాంకు రుణాలపై తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. డ్వాక్రా మహిళలు పొదుపు ఎక్కువ చేసుకుంటే ఎక్కువ రుణాలు పొందటానికి వీలుంటుందన్నారు. డ్వాక్రాగ్రూపు సభ్యులు స్త్రీనిధిలో కూడా పొదుపు చేసుకోవాలన్నారు. డ్వాక్రా గ్రూపు సభ్యులు ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు మాత్రమే బ్యాంకు రుణాలను వినియోగించాలన్నారు. సమావేశంలో సీసీలు విజయకుమార్, మధు, పూర్ణయ్య, ఎంఎస్‌ఏ సీతా మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సలహా మేరకు మందులు వాడుకోవాలి

● వైద్యాధికారి సుమంత్



కొల్లిపరలో మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్న వైద్యాధికారులు

కొల్లిపర, మే 24 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహా మేరకు మందులను వాడుకోవాలని వైద్యాధికారి సుమంత్ అన్నారు. శనివారం కొల్లిపర శివారు గుడిబండివారిపాలెంలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపును నిర్వహించారు. వైద్యాధికారులు రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమంత్ మాట్లాడుతూ మెడికల్ క్యాంపులో వైద్యపరీక్షలు చేయించుకోవడం వలన దీర్ఘకాలిక రోగాలను గుర్తించవచ్చన్నారు. గ్రామీణ ప్రజలు మెడికల్ క్యాంపును వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సంగెపు శ్రీనివాసరావు, ఏఎన్ఎం మణిమ్మ, డీఈవో బొమ్ము కోటిరెడ్డి, ఆశా కార్యకర్తలు ప్రేమకుమారి, వాణి తదితరులు పాల్గొన్నారు.